శ్రీ:

# నాగానంద నాటకము

సంస్కృతమూలము : శ్రీహర్షుడు .

6 వ శతాబ్దమునుండి సంస్కృత సాహిత్యములో

ప్రఖ్యాతి గాంచిన నాటకమునకు

ఆంధ్రానువాదము.

సాహిత్యాభిమానులైన ఆంధ్రులకు,వినయముతో అందించిన కానుక .

**నేనేదీ ఈయని, తానేదీ అడుగని**

**నా అర్ధాంగి మెహెర్ లక్ష్మికి వేడుకగా ఇచ్చిన కానుక.**

**శా.శ.1937-మన్మథాధికాషాఢ కృష్ణపంచమి – 06-07-2015.**

**అనువాదకుడు**

**బొడ్డుచెర్ల మార్కండేయ ప్రసాద్**

**ఆంధ్రబ్యాంక్ విశ్రాంతాధికారి**

**పటేల్ నగర్, బాపట్ల, గుంటూరు జిల్లా**

**ఆంధ్ర ప్రదేశ్ - 522101**

**చరవాణి : 94402 60163**

తెలుగు అనువాదము: మార్కండేయ ప్రసాద్ -2015.

# మనవి

2014 లో ఆంధ్ర బ్యాంక్ నుండి పదవిరమణ చేసిన తరువాత బాపట్లలో ఉండేటప్పుడు కాలక్షేపానికని సంస్కృతకావ్యాలు చదువుతూ ఉండగా ఈ నాగానందనాటకం కంట బడింది. అప్పటికి సుమారు పదేనేళ్ళకు ముందు దీనిని ఒకసారి చదివే ఉన్నాను. అప్పట్లోనే దీనిని తెలుగులోనికి అనువదించుదామని కుతూహలం ఉండేది కాని, అప్పుడు నా సాహిత్య వ్యాసంగం ఆగిపోవటంతో ఆ ఆలోచన మరుగున పడింది. అప్పుడనుకొన్న పనిని ఇప్పుడు చేద్దామని బుద్ధి పుట్టింది. యథాశక్తి అనువదించాను. కొంతకాలం తరువాత నాకు దొరకిన నిర్ణయసాగర్ ప్రతిని చూస్తే, అది నేను అనుసరించిన మూలానికి దాదాపుగా సరిపోయింది. చిన్న చిన్న పాఠ భేదాలను నేను పట్టించుకో లేదు. ఇంతకుముందు చేసిన పాండవోద్యోగ విజయనాటకానువాదాలతోను,వేణీసంహారనాటకానువాదంతోను పోల్చి చూస్తే, దీనిలో మూలాధిక్యం దాదాపు లేనట్లే.

కొన్నాళ్ళకు, నాకు జగజ్జాలసౌకర్యం (internet) కలిగిన తరువాత, ఏవేవో గ్రంథాలకోసం వెదకుతూ ఉంటే, ఈ నాగానందనాటకానికి కొందరు ప్రసిద్ధులు చేసిన అనువాదాలు తలవని తలంపుగా దొరికాయి. ఆ అనువాదకులలో,వేదం వేంకటరాయశాస్త్రి, వేటూరి ప్రభాకరశాస్త్రి,చిట్టిగూడూరు వరదాచార్యులు, పుల్లెల శ్రీరామచంద్రుడు వంటి మహామహులు ఉన్నారు. ఇంకా ఎవరన్నా దీనిని అనువదించి ఉన్నారేమో తెలియదు. అంతటి వాళ్ళ అనువాదాలముందు మరల నాబోటివాడు చేసిన అనువాదం హనుమంతుడి ముందు కుప్పిగంతువంటిదే కాని, పెద్ద పెద్ద విద్వాంసులు చేసిన పనిని ఒక

ఉబలాటపు 'ఉలుపా గాడు' చేస్తే ఎలా ఉంటుందో చూసి ఆనందించే అవకాశం తెలుగు నాటి పండితులకు దీని ద్వారా కలుగుతుందేమో కలుగనిద్దాం!

నా అన్ని పుస్తకాలలాగే దీనిని కూడ, నా జగద్వేదికలో (website) ఉంచాను. www.vyshnavikrishnamemorial.in లో చూడండి.

ఉత్సాహానికి తగిన శక్తి లేని నా రచనలో ఏపైన తప్పులు దొరలి ఉంటే పెద్దలు సహృదయతతో మన్నిస్తారనే ఆశయంతో-

**మార్కండేయప్రసాద్ .** **శా.శ.1937 , (సా.శ. 2015)**

**బాపట్ల.**

## ముఖపత్రము

మ్రొక్కులు పూజలందుకొను భూజము లుండును గొన్ని; బాటకుఁ
బ్రక్కన నుండు నొండెడ ననామకవృక్షము లొక్క కొన్ని యా
చక్కని బాటసారులకుఁ జక్కని నీడనొసంగి తేర్చుచుఁ ;
తక్కువ గావు వానికివి, తథ్యముఁ జూడ నొకింత యెచ్చె యౌ. 1

ప్రజ్ఞాదర్పముగాదు, కాదు లవముఁ పాండిత్యగర్వంబు, శా
స్త్రజ్ఞానాద్భుతశేముషీవిభవధౌరంధర్యముఁ గాదు, కా
వ్యజ్ఞత్వాదినిదర్శనార్థధిషణాహంకారముఁ గాదు, నా,
కజ్ఞానంబునుఁ జాపలంబె కవితా వ్యాపారపుఁ మూలముల్ 2

భాష లోన పుట్టి, భాషలోన పెరిగి,
భాష వలన హృదయతోష మొంది,
భాష ఋణ మొకింత బాపుకోఁ దలచి, యీ
చిన్న యత్న మిట్లు జేసినాడ. 3

## కానుక

నగయుస్  నట్రయు, భూమి పుట్ర, ధనముస్ దస్కంబు దాకేల? లే
దు గదా కొంపయు గోడి! యింక మరి సంతోషంబు నీ కెట్లు గూ
ర్పగలస్? నూటికి నాటికొక్కరికి గోరస్ జేరగా రాని కా
న్క గదా యిట్టిది! దీని గైకొనుము 'నాగానందము'స్  శ్రీమతీ!

" కట్టెడి వలువా! మెడలోఁ
బెట్టెడి  గొలుసా! యిదేమి వెర్రి!" యనకు; మీ
పుట్టువునకు నే నీఁగల
కొట్టరు విది నీకు, దాచుకొనుము ప్రియముగస్.

" ఏమి నంబి! నా పెండ్లి కే మిత్తు " వనిన ,
"యెదురు రా నది చాలదా యేమి " యన్న
యట్లు , తోడ్పడకున్న నే మయ్యె?  నీవు
నన్ను వ్రాసుకోనిచ్చుటే నాకు వరము.

---- నా అర్ధాంగి మెహర్ లక్ష్మికి.

# నాగానందము

## నాంది

'ధ్యానంబంచుఁ గనుల్ మొగిడ్చి మది నే యబ్జాక్షిఁ ధ్యానించెదో!
సూనాస్త్రాహతలస్, మముం గనుమ యిచ్చోఁ, ద్రాతవై కావకుం
టీ, నీ కారుణికత్వమెల్ల మృష, యింకెవ్వండు నిన్మించుఁ గ్రౌ
ర్యానస్?బొ'మ్మని యప్సరల్ దెగడు సర్వజ్ఞుండుమిమ్మోమెడుస్.1
విలుదాల్చి చిత్తజుండుస్, విహతపటహుల్లై పేర్చి తత్పార్శ్వచారుల్,
చెలువౌ భ్రూభంగజృంభాస్మితలలితలసచ్చేష్టలస దివ్యవేశ్యల్,
'బళిరా నైశ్చల్య'మంచబ్రపడి హరియునుస్,బ్రహ్ములైసిద్ధముఖ్యుల్,
దిలకింపస దన్ను , బోధిస్థిరుడగు ముని వర్తించు మీ రక్షకుండై. 2

(నాంద్యంతమున సూతధారుడు ప్రవేశించును)

సూత్ర: నేడీ ఇంద్రోత్సవదినమున నానాదేశములనుండి వచ్చిన శ్రీహర్షదేవ మహారాజసామంతరాజసమూహము నన్ను సాదరముగాఁ బిలిచి, 'మన మహారాజు శ్రీహర్షుల వారు, విద్యాధరజాతకకథ నాధారముగాఁ గొని నాగానందమను నొక యపూర్వవస్తువర్ణనాలంకృతమైన నాటకమును రచించిరని కర్ణాకర్ణి వినుటయే కాని ప్రదర్శింపగా నింతవరకుఁ జూడలేదు గనుక, ప్రభువులపైఁ గల గౌరవముతోఁ బాటు మాయెడలఁ గల సౌహార్దమునుఁ గూడ పురస్కరించుకొని, నీవు నేడా నాటకమునుఁ దగిన రీతినిఁ బ్రదర్శింపు'మని కోరిరి.కనుక వారి యభిలాషమునుఁ దీర్చుటకునేపథ్యాదిసముచితసన్నాహమునుఁగావింతును.

**(పరిక్రమించి, పరికించి)** సభ్యుల మనస్సులను
గెలుచుకొన్నట్లే యని యెంతును. ఎట్లనిన,

**కవి శ్రీహర్షుడు, వీరు సభ్యులు గుణగ్రాహుల్, నటుల్ జూడ నా**
**ట్యవిశేషజ్ఞులు, బోధిసత్త్వచరితంబా లోకవిఖ్యాత, మీ**
**ప్రవరశ్రేణి నొకండొకండె బుధులన్ రంజింపగాఁ జేయు, ని**
**ట్లవితర్క్యంబుగఁ గూడె నీ గుణసమాహారంబు, భాగ్యంబునన్.** 3

ఇక నా ప్రేయసినిఁ బిలిచి సంగీతమునుఁ బ్రారంభింపఁ
జేయుదును. **(పరిక్రమించి, తెర లోనికిఁ జూచి)** ఆర్యా!

**పరిజనబంధుద్విజహిత!**
**వరభవనసరో మరాళి! భాసురశీలా!**
**పరపురుషచంద్రకమలిని!**
**భరమగు పనిగలిగె నేడు, త్వరగా రమ్మా!** 4

**నటి:** **(కన్నీటితోఁ బ్రవేశించి)** ఇదిగో వచ్చితిని.

**సూత్ర:** అరే! ప్రియా!నాగానందనాటకమునుఁ బ్రదర్శింపఁబోవుచు
నీ యకారణదుఃఖమేల?

**నటి:** ఆర్యా!దుఃఖము గాకింకేమి?మరి మీ తల్లియుఁ దండ్రియు
నిరువురునుఁ, దమకు వయసు పైఁ బడినదనియును,
విరక్తులమైతి మనియు, మీరు గృహనిర్వహణశక్తులరైతి
రనియుఁ జెప్పి తపోవనమున కేగిరి.

**సూత్ర:** ఏమీ! తల్లిదండ్రులు నన్నుఁ గూడ విడిచి పోయిరా!
**(చింతించి)** మరి, ఇప్పుడేది తగిన దారి? ఎట్లును నేను
పితృచరణసేవాసుఖమును వదలుకొని యింట నుండఁ
జాలను. కనుక,

వదలి క్రమాగతమగు సం
పద, పితృశుశ్రూషకొరకు వనభూమికిఁ బో
యెద, వారి నరసికొనుచుం
డుదు, నీ జీమూతవాహనుని వలె నేనుస్. 5

(ఇరువురును నిష్క్రమింతురు. )

(ఇది ఆముఖము)

# నాగానందము

## ప్రథమాంకము

**(అంత జీమూతవాహనుడు  విదూషకునితోఁ గలిసి ప్రవేశించును)**

**జీమూతవా:** **(నిర్వేదముతో)** మిత్రమా, ఆత్రేయా!

**పరువమనిత్యముస్, వలపుప, ట్టవుగాములు గానదంచు ను**
**ర్వరఁ బ్రతివాడెరుంగు, నటువంటి దురింద్రియలౌల్యదోషసం**
**భరితమ యయ్యు నీ కొమరుఁబ్రాయము నాకు ముదంబె కూర్చు,నీ**
**వరుసనె తల్లిదండ్రుల సపర్య లొనర్చుచు నుండఁ గల్గినస్. 6**

**విదూ:** **(చిరాకుగా)** ఏమోయి మిత్రమా! జీవచ్ఛవములఁ బోలు నీ వృద్ధపితరులకై ఇంత కాలమునుండి యిట్టి దుర్భర వనవాస క్లేశమనుభవించుచున్నను నీ కింకను  విసుగు బుట్టలేదా! కనుక ఇంక నైనను నాయందు దయయుంచి నా మాట విని యీ పితృసేవానిర్బంధమునుండి వెలువడి యథేష్టభోగరమణీయమైన రాజ్యసుఖము ననుభవింపుము.

**జీమూతవా:** వయస్యా!ఎంతమాట?ఇది సరికాదు.ఎందుల కందువా?

**పితృసవిధక్షితిస్థితునిఁ బెంపున మీరునె రాజపీఠ సం**
**స్థితుడు? స్వమాతృతాతపదసేవకు సాటియె రాజ్యభోగముల్?**
**పితృజనభుక్తశేషమిడు ప్రీతి జగత్త్రయమేలఁ  గల్గునే?**
**వెత శ్రమగాక, తండ్రి నెడపెట్టిన వానికి రాజ్య మొప్పునే? 7**

**విదూ:** **(తనలో)** ఆహా! ఎంత పితృసేవానురాగము! **(ఆలోచించి)** పోనీ, ఇట్లు చెప్పి చూచెదను. **(ప్రకాశముగా)** అయ్యా!

నేను కేవలము రాజ్యభోగముల కనియే అట్లు చెప్పలేదు. నీకు మిగిలిన  కృత్యమింకనుఁ జాల గలదని.

**జీమూతవా:** **(చిరునవ్వుతో)** సఖా! చేయవలసిన దంతయునుఁ జేసియే యుంటినే! నీకుఁ దెలిసినదే కదా!

**కూరిచినాడ సజ్జనులకున్ దగు వృత్తులు, న్యాయమార్గ సం**
**చారులఁ జేసితిన్ బ్రజల, జ్ఞాతులఁ  జేసితి మత్సమానులన్,**
**కోరినదాని కెక్కుడొనగూర్చెడుకల్పక మర్థి కిచ్చితిన్**
**గోరగ, రాజ్యరక్ష నెలకొల్పితి, నింకనుఁ గృత్యమున్నదే?** 8

**విదూ:** మిత్రమా! రాజ్యరక్షణమును గూర్చియే నేనన్నది. కడు దుండగీడును, నీకుఁ బ్రగాఢద్వేషియు నైన నీచ మతంగుడు చెంతలఁ బొంతలఁ బొంచియే యుండగా, ఎంత ప్రధానామాత్యపరిపాలితమై యున్నను నీవక్కడ లేనిదే నీ రాజ్యము సురక్షితము గాదనియే యెంచుము.

**జీమూతవా:** మతంగుడు మనరాజ్యమును హరించుననియేనా నీ భయము? అట్లైన మాత్రమేమి? దేహమునుండియు సర్వమునుఁ బరార్థమని యెంచియే నేను జూచుకొను చున్నాను. తండ్రిగారిచ్చిన రాజ్యము నాయన యాజ్ఞ లేక ఇతరులకీయ జంకి గాని, లేకున్న నీపాటికి  నేను స్వయముగానే వానికిచ్చి యుండనా! సరే యిప్పుడీ మాటలేల? తండ్రిగారి యానతిఁ జేయుటయే ముఖ్యము. 'నాయనా! జీమూతవాహనా! చిరకాలము మన మిందుండుటచే నీప్రదేశమందలి నీవారకందమూలాదులు నిశ్శేషమైన ట్లున్నవి. సమిత్కుశమ్ములు గూడ విరళ

లభ్యము లగుచున్నవి. కనుక మలయపర్వత ప్రాంతమున సర్వవస్తుసమృద్ధమై మనకు నివాస యోగ్యమైన యాశ్రమస్థానమును గనుగొని ర' మ్మని తండ్రిగారాజ్ఞాపించిరి.పద,మలయపర్వతసమీపమునకు బోవుదము.

**విదూ:** మంచిది, నీవన్నట్లే. పోదము పద.

**(ఇరువురు బరిక్రమింతురు.)**

**విదూ:** **(ముందుజూచి)**వయస్యా!చూడుమీ మలయవాయువులు చందనవనమధ్యసంచారలగ్నచందనపరిమవాహులై, పైనుండి పడుటచే జిదికి చిందుచున్న సెలయేరుల నీటి తుంపురులతోగలిసి వీచుచు మనకు మార్గాయాసము బోగొట్టుచు బ్రథమసందర్శనోత్కంఠితప్రేయసీపరిరంభము వలె మేనికి గగురుపాటు జేయుచున్నవి.

**జీమూతవా:** **(చుట్టును జూచి, అచ్చెరువుతో)** ఏమీ! అప్పుడే మలయగిరికి వచ్చితిమా! ఆహా! ఏమి దీని రామణీయకము! ఎంత మనోహరము!

**గంధేభఘనగండకషణభగ్నమ్ముకలై**
**రసమోడు చందనవ్రజముతోడ,**
**జలధితుంగతరంగసంచయాస్ఫాలిత**
**క్రందద్గుహాగహ్వరములతోడ,**
**సంచరత్సిద్ధయోషాపదాలక్తకాం**
**చితరక్తమౌక్తికశిలలతోడ,**
**వటశిఫాభ్రాంతికృద్విటపలంబితనభ**

**స్వద్ధూతదీర్ఘసర్పములతోడ,**
**సర్వతోదృశ్యఫలపుష్పసమితితోడ**
**స్వచ్ఛవా: పూరశోభినిర్ఝరులతోడ,**
**ఘోరమయ్యును, రమ్యమై క్రొత్త రీతి,**
**మనసు నుత్సుకపరచు నీ మలయశిఖరి. 9**

రమ్ము. ఈ కొండచరియ నెక్కి మనకేదైన నివాసయోగ్య స్థలము దొరకునేమో చూతము.

**(కొండ పైకెక్కుటను నటింతురు.)**

**జీమూతవా:** **(కుడి కన్నదరుటను సూచించి)** మిత్రమా! ఇదేమి !

**అదరుచున్నది కుడికన్ను, మదిని నాకు**
**నే ఫలాకాంక్ష లేదు, మునీరి తోక్తు**
**లెప్పుడునుమృషల్ గావు, మరిట్టి యెడల**
**శుభనిమిత్తము నాకు యత్సూచకంబొ? 10**

**విదూ:** మిత్రమా! అట్లైన యిది తప్పక సమాసన్నప్రియాగమసూచనమే!

**జీమూతవా:** అవును. నీవన్నట్లే కావచ్చును.

**విదూ:** **(సంతోషముతో)** మిత్రమా! ఈ వైపు చూడుము. ఎత్తుగా నొత్తుగా పెరిగిన చెట్ల గుంపులు, వాని పైనుండి యెగయు హవిస్సుగంధభరితధూమములు, చుట్టుప్రక్కలఁ గాలి బాటలలో నిర్భయముగఁ బ్రశాంతముగా విశ్రమించి యున్న వన్యజంతువులును! ఇది యేదో తపోవనము వలె నున్నదే!

**జీమూతవా:** మిత్రమా! లెస్సగా గురుతు పట్టితివి. ఇది తపోవనమే.

ఎట్లనిన,

**ధరణీజమ్ములు వల్కలార్థమితకృత్తత్వక్కముల్ బైపయిన్,**
**గరుణన్ బోలె; జరత్కమండలులు గన్పట్టున్ నభస్స్వచ్ఛని**
**ర్ఝరనీరమ్ముల; సామమున్ జదువుఁ గీరశ్రేణి నిత్యశ్రుతి**
**స్థిరతన్; వర్ణిజనోజ్ఝితత్రుటితమౌంజీమేఖలల్ గాననౌ.** 11

పద, పోయి చూతము.

**(ఇరువురునుఁ బ్రవేశమును నటింతురు.)**

**జీమూతవా:** **(అంతటఁ బరికించి)** ఓహోహో! సందిగ్ధవేదవాక్యార్థవిచారణ పరాయణమునిగణములతోను, వేదపాఠముఁ జదువు కొనుచుఁ బచ్చిసమిధలనుఁ ద్రుంచుకొనుచున్నవటువుల తోను, క్రొత్తమొక్కల పాదులకు నీరుబోయుచున్న ముని బాలికలతోను, ఈ మునివనము ప్రశాంతరమణీయముగా నున్నది గదా! మరొక విశేషముఁ జూడుము.

**అళికులశబ్దజాలముల స్వాగతవాక్యముఁ బల్కునట్టులున్,**
**ఫలభరనమ్రశీర్షముల వ్రాలి నమస్కృతిఁ జేయునట్టులున్,**
**గళితసుమోరువృష్టిపరికల్పన నర్ఘ్యమొసంగునట్టులున్,**
**బొలుపగునౌర! యిందతిథిపూజలు నేర్చెనె యేమొ శాఖులున్! 12**

సర్వవిధముల నీ తపోవనము మనకు నివాసయోగ్యమే. తల్లిదండ్రులకుఁగూడ యీచోటు సుఖమును, సంతసమునుఁ, గలిగించును.

**విదూ:** మిత్రమా! ఏమియో కాని యీ పట్టున లేళ్ళనుఁ జూడుము, మెడల నించుక వెనుకకుఁ ద్రిప్పి, తెరచుకొని యున్న నోళ్ళనుండి గడ్డి పరకలు జారి పడిపోవు

చున్న నుఁ దెలియక, చెవులు రిక్కించి,కన్ను లరమూసి, దేనినో వినుచున్న ట్లున్న వి గదా!

**జీమూతవా:** **(చెవి యొగ్గి, విని)** సందేహమేమి? చక్కగాఁ గనిపెట్టితివి.

**తమస్థానమ్ములఁ దాకి స్పష్టపడఁ ద్రిస్థాయుల్, స్ఫురత్స్పష్టధా**
**గమకమ్ముల్ బలుకన్, మిళిందకులఝుంకారాభవీణారవం**
**బమరన్ దోడయి, కర్ణపేయమృదుశబ్దప్రోతమై యొప్పు గీ**
**తమునాలించుఁ గురంగముల్,నిలిచి మేతల్ మాని,మార్గోముులన్.13**

**విదూ:** అది సరియే కాని, తపోవనమునందీ సంగీత మేమి? పాడువా డెవడై యుండును?

**జీమూతవా:** మృదుతరాంగుళితాడితములైనట్లు తీగలుగూడ మృదువుగానే మ్రోగుచున్న వి. పైగా, గీతము, కాకలీ నిషాదమే ప్రచురముగా నడచుచున్న ది. కాబట్టి, **(చేతఁ జూపుచు)** ఈ దేవాలయములో నెవ్వరో యొక దివ్యస్త్రీ దేవతనుఁ గొలుచుచు వీణ మీటుచుఁ బాడుచున్న దని భావింతును.

**విదూ:** మనముగూడ యీ దేవాలయములోనికిఁ బోయి చూతము రమ్ము.

**జీమూతవా:** మేలుమాట. దేవతలకు మ్రొక్కవలసినదే! **(నడచుచు హఠాత్తుగా నిలిచి)** వయస్యా! ఒకవేళ, యీ యున్న వారు మనమెదుటపడి చూడఁ దగని వారేమో! కనుక, యీ తమాలతరువాటిక మాటున నిలచి దేవతా దర్శనోచితసమయమును వేచి యుందము.

**(అంత నేలపైనఁ గూర్చుండి వీణవాయించుచుఁ బాడుచున్న**

మలయవతియు, చేటి చతురికయునుఁ బ్రవేశింతురు.)

**మలయ:** (వీణావాదముతోఁ బాడుచు)

నగకులకీర్తికేతన! వినమ్రజగత్త్రయలోక! నిన్ను నేఁ
బొగడగ నేర్తునే? దృఢతపోజితఫాలదృగర్ధదేహ! దృ
గ్యుగకమనీయ! ఫుల్ల కమలోదరగౌరపరాగరాగ! యో
భగవతి! గౌరి! నీ కరుణ వాంఛితసిద్ధి యొనర్చుఁ గావుతన్. 14

**జీమూతవా:** (వినుచు) ఆహా! ఏమి గాత్రము! ఏమి వాద్యము!

దశవిధవ్యంజన ధాతువిన్యాసంబు
నద్భుతంబుగనభివ్యక్తపరచె,
లంబితద్రుతమధ్యలయలు మూటినిఁ దత్త
దుచితస్థలంబుల నొప్పఁ గూర్చె,
స్రోతోవహాదిత్రిరూపోక్తయతి, శ్రుతి
కింపు బుట్టగ సంవదింపఁ జేసె,
అతివ, సత్వౌఘానుగతవాద్యవిధిభేద
ములు మూడు వేర్వేర వెలయఁ జేసె,
పాటకన్నిగతుల దీటైన వాద్యంబు
వాద్యమునకు సాటివచ్చుపాట
గలిసి, పరిమళించు కనకమట్టులు, వాగ
గోచరమగు ముదముఁ గూర్చె మదికి. 15

**చేటి:** రాజకుమారీ! చాలసేపు వాయించితివిక నీనాటికిఁ జాలును. అలసట రాలేదా! వ్రేళ్ళు నొచ్చునేమో !

**మలయ:** చతురికా! దేవి సాన్నిధ్యమున వాయించుచుండగా నా కలసటయన్న మాటెక్కడిది!

**చేటి:** **(కొంచెము తిరస్కారముగా)**అవునమ్మా మరి! కన్యకాజన దుష్కరములైన నియమోపవాసాదులతో నీ దేవిని యింతకాలముగా నారాధించుచున్నను, నేటికిని నిన్నుఁ గరుణింపని యీ నిర్దయదేవత నింకను మిక్కిలిగా గాన వాదనములతో సేవించుటవలన నేమి లాభమని యనుచున్నాను.

**విదూ:** మిత్రమా! ఈమె కన్యయట గదా! చూచుట కేమి యాక్షేపము?

**జీమూతవా:** కన్యకాదర్శనములోఁ దప్పేమియు లేదు గాని, మనము గనబడినచో యీమె ,కన్యాసులభలజ్జాసాధ్వసములచే నెక్కువ సేపిక్కడ యుండక పోవచ్చును. కావున యీ తీగల మాలల చాటునుండియే చూచుచుందము.

**విదూ:** **(పరిశీలించి ఆశ్చర్యముతో)** మిత్రమా! చూడుము! ఈమె తన వీణావాదనగానములతో వీనులకే కాదు, విద్యాను రూపమైన రూపముతో కనులకుఁగూడ యానందమునుఁ గలిగించుచున్నది. ఎవరై యుండును! నాగకన్యకయా! లేక విద్యాధర కన్యయా! మరి సిద్ధకులకన్యయా!

**జీమూతవా:** **(ప్రీతితోఁ జూచుచు)** వయస్యా! ఈమె యెవరన్నది చెప్పఁజాలనుగాని, యిది మాత్రము సత్యము.

**స్వర్గసంభవయైన, చక్షుస్సహస్రసా**
**నాథ్యంబు సఫలంబు నాకపతికి,**
**నాగకన్యకయైన, నాగలోకము సచం**
**ద్రం బేతదాస్యబింబంబు వలన ,**

**విద్యాధరియయైన, విజితసమస్తాన్య**
**జాతి విద్యాధరజాతి మనది,**
**సిద్ధాన్వయజయైన, సిద్ధులే త్రిజగత్ప్ర**
**సిద్ధపూజార్హసమిద్ధయశులు,**
**లేమ యేజాతిఁ బుట్టెనో యేమొ, కాని,**
**యిన్ని గిరులుండ , నెన్నినట్లిటకు వచ్చి,**
**విశ్వమోహిని యై యిట్లు వెలయుటెల్ల**
**మలయగిరిపూర్వకృతపుణ్యమహిమ గాదె! 16**

**విదూ:** **(జీమూతవాహనునిఁ బరీక్షించి, తనలో)** భళీ! ఇంత కాలమున కిత డెట్టకేలకు మారునికిఁ జిక్కినాడు. మారునకే కాదు **(తనను జూపించుకొనుచు)** ఈ బ్రాహ్మణునకు నాకుఁగూడ.

**చేటి:** రాకుమారీ! దయమాలిన యీ దేవతయెదుట గానము వీణావాదనము లేల యని చెప్పుచున్నాను గదా! **( వీణనుఁ దీసివేయును).**

**మలయ:** చతురికా! వలదు వలదు. దేవిని నిందింపకుము. ఆమె నేడు నన్ను దయదలచినది.

**చేటి:** **(సంతోషముతో)** ఏమి? అయిన నా దయదలచుట యేమో యెట్లో నాకునుఁ జెప్పుము.

**మలయ:** రాత్రి కలలో యిట్లే వీణవాయించుచుంటినట! అప్పుడు గౌరీదేవి నాకగపడి చెప్పినదట, 'బాలా! నీ భక్తికి, గానమునకు, వీణాకౌశలమునకు, మీదుమిక్కిలి కన్యకాదుష్కరమైన అసాధారణసేవకును మెచ్చితిని.

అచిరకాలముననే నిన్ను విద్యాధరచక్రవర్తి చేపట్టును.'
అని.

చేటి: రాకుమారీ! అట్లయిన నిది స్వప్నమని చెప్పనేల? నీ మనసులోని మాటయే దేవి సెలవిచ్చిన వరప్రాప్తి గూడ!

విదూ: **(ఆకర్ణించి)** వయస్యా! ఏ దేవీదర్శనమునకైనను మన కిదియే కడు లెస్స యైన సమయము. పద వోవుదము.

జీమూతవా: నేను మాత్రము రాను.

విదూ: **(బలవంతముగా లాగుకొనుచు వోయి, మలయవతిని సమీపించి)** మీకు శుభమగు గాక! అమ్మా! చతురిక మాట సత్యమే! దేవి నీపై జూపిన ప్రసాదము వర ప్రాప్తియే! ఇదే యా వరస్వరూపము!

మలయ: **(తత్తరపడి లేచి, జీమూతవాహనుని యుపలక్షించి)** చేటీ! వీరెవరు?

చేటి: **(జీమూతవాహనుని పరికించి,అపవారించి, మలయవతితో)** అమ్మా! అనన్యసదృశమైన యీ రూపముఁ జూడగా, నీకు దేవి యిచ్చిన వరప్రసాదమే యేమో యనిపించుచున్నది.

**(మలయవతి ప్రీతితో, లజ్జతో జీమూతవాహనునిఁ జూచుచుండును)**

జీమూతవా:

**తపమూనియె కడు డస్సితి**
**విపుడీ సంభ్రమము చేత యింకను శ్రమదా**
**లుపనేల? మాను, సాధ్వస**
**చపలాక్షీ! శ్వాసభారచలితోరసిజా!** 17

మలయ: **(అపవారించి)** చేటీ! చెప్పలేని భయముచేత , యితని

యెదుట నిలువఁ జాలకున్నాను. **(మొగము కొంచెము వెనుకకుఁ ద్రిప్పి, యోరగంట నతనినిఁ జూచుచు నిలచును.)**

**చేటి:** **(జనాంతికముగా)** అమ్మా! ఏమిది! ఇట్లెతివేమి?

**మలయ:** **(జనాంతికముగా)** ఇతని చెంత నుండ సిగ్గగుచున్నది. పద ప్రక్కకు బోదము. **(పోఁబోవును.)**

**విదూ:** వయస్యా! ఈమె భయముతో పోఁబోవుచున్నదిగదా! నా చదువును బుర్రలో నిలిపినట్లే యీమెను గూడ క్షణ మాత్రము నిలుపుదునా?

**జీమూతవా:** అది తప్పా యేమి! కానిమ్ము.

**విదూ:** **(మలయవతితో)**అమ్మా!ఇది మీ తపోవనాచారమా యేమి, వచ్చిన యతిథులకుఁ బలకరింపైన దక్కలేదు.

**చేటి:** **(మలయవతినిఁ జూచి)** ఈమె చూపులు ఈమె వాలకము జూడ నీతనియం దనురక్తయైన ట్లగపడుచున్నది! కాని మీ్మ త్రోవఁ ద్రొక్కెదను. **(ప్రకాశముగా)** అమ్మా! ఈ బ్రాహ్మణుడన్నది యుక్తమే. అతిథిసత్కారము నీకుఁ దగినదే. అందును ఇటువంటి మహానుభావుడే యతిథి యైనపుడు, ఆగంతుగౌరవమే యెరుంగనిదానివలె యుంటివేమి? పోనీ నేనే యథోచితముగా గావింతును. **(జీమూతవాహనునితో)** ఆర్యా! స్వాగతము. దయ చేయుడు. ఇట నాసీనులై ఇచ్చోటు నలంకరింపుడు.

**విదూ:** మిత్రమా! ఈమె బాగుగా చెప్పినది . ఇటఁ గూర్చుండి కొంత విశ్రమింతము.

**జీమూతవా:** సరిగా జెప్పితివి. **(ఇరువురును౹ గూర్చుందురు.)**

**మలయ:** చతురికా! గేలిమాటలుజాలును ! ఇట్లు చేసెదవేల? ఏ తాపసియో కనుక చూచిన, నన్ను నిర్మర్యాదురాలినిగా దలంపరా?

**(అప్పుడొక తాపసుడు ప్రవేశించును.)**

**తాపసి:** ఆచార్యకౌశికులు నాతో, "వత్సా!శాండిల్య! తండ్రి పనుపున యువరాజు మిత్రావసువు , తన చెలియలు మలయవతికి దగిన వరునిగా నెంచుకొనిన భవిష్య ద్విద్యాధరచక్రవర్తి యైన జీమూతవాహనుడు, మలయ పర్వతపరిసరములలో నున్నవాడని తెలిసికొని యాతనిని౹ జూచుటకై నేడరిగెను. అన్న కొరకై నిరీక్షించుచున్న మలయవతికి మధ్యాహ్నహోమవేళ దాటిపోవునేమో! కనుక నీవేగి మలయవతి యెక్కడ యున్నదో చూచి పిలిచికొని ర" మ్మని చెప్పి పంపెను. అలవాటు చొప్పున నామె గౌరీమందిరములోనే యున్నదేమో చూచెదను. **(నడచుచు నేలపై జూచి)** అరే! ఈ దుమ్ముసేలమీద౹ గనబడుచున్న ఈ చక్రవర్తి చిహ్నాంకితపదపంక్తి యెవరిది? **(ముందు జూచి, జీమూతవాహనుని గురుతించి)** ఈ మహాపురుషునివే యై యుండును. అదిగో!

**శ్రీవిభ్రాజిశిరస్సునస్ వెలయు నుష్ణీషమ్ము, భ్రూమధ్య మూ**
**ర్ణావర్తాన్వితమున్, గరద్వయము చక్రాకారచిహ్నమ్ము, వ**
**క్షోపైశాల్యము విష్ణువున్ గెలుచు, జక్షుల్ బద్మముల్, వీడె సు**

**మ్మా విద్యాధరచక్రవర్తిపదముం బాటింప కిట్లుండెడిన్.** 18

సందేహమేల? నిక్కముగా నీతడే జీమూతవాహనుడు.

**(మలయవతినిఁ జూచి)** అరే! రాజకుమారిగూడ!

**(ఇరువురను బరిశీలించి)** అన్యోన్యానురూపమైన యీ

జంటనుఁ గూర్చినఁ గదా విధాత కింతకాలమునకైనను

యుక్తకారి యని పేరు వచ్చును! **(సమీపించి**

**జీమూతవాహనునితో)** ఆర్యా! స్వస్తి.

**జీమూతవా:** **(లేచి)** మహాత్మా! జీమూతవాహనుడను నమస్కరించు

చున్నాను. ఇందు దయచేయుడు. **(తన పీఠమునుఁ**

**జూపును.)**

**తాపసి:** చిరం జీవ. వలదు వలదు. అభ్యాగతుడు సర్వపూజ్యుడు

గనుక నీవే కూర్చుండుము.

**జీమూతవా:** మంచిది.

**మలయ:** ఆర్యా! నమస్కారము.

**తాపసి:** కల్యాణీ! అనురూపభర్తను గాంచుము. రాజపుత్రీ!

మధ్యందినహోమవేళ యతిక్రమించుచున్నది కనుక

నిన్ను త్వరగా రమ్మని కులపతికౌశికులు బిలుచు

చున్నారు.

**మలయ:** కులపతుల యాజ్ఞ. **(తనలో)**

**ఒక్క వైపు గురూక్తి, యింకొక్క వైపు**
**ప్రియముఖాలోకసుఖము, లీ రెంటఁ జిక్కి,**
**నిలువఁ దగమిఁ, బోలేమిఁ, గొందలముఁ జెంది**
**మనసు నాకిప్డు డోలాయమానమయ్యె.** 19

**(నిట్టూర్చి, లజ్జానురాగములతో జీమూతవాహనుని౯ జూచుచు, చేటీ తాపసులతో౯ గలిసి నిష్క్రమించును.)**

**జీమూతవా:** **(ఉత్సుకతతో నిట్టూర్చి, పోవుచున్న మలయవతిని౯ జూచుచు)**

**సర్వహృత్కర్షివిస్తృతజఘనభూరి**
**భారభరణాతిమంథరహారిగమన,**
**యన్యపథగత యయ్యు , మదంతరంగ**
**నిహితపద యయ్యె యీ కాంత నిశ్చయముగ.20**

**విదూ:** వయస్యా! నీకు అదరవలసిన కన్నదో యదరనే యదరినది. నీవు చూడవలసిన దేదో చూడనే చూచితివి. ఇక నా మాట౯ జూడుము. ఇప్పుడీ మధ్యాహ్నపు టెండకు రెట్టింపుగా మండుచున్న యాకలి మంటచే నా కడుపు నకనకలాడుచున్నది. కనుక పోయి యే మునికుటీరమందో యతిథులముగా నుండి యక్కడ దొరకిన యే కందమూలములతోనో ప్రాణములను నిలుపుకొందము పద.

**జీమూతవా:** **(ఆకాశము జూచి)** ఓహో! మట్టమధ్యాహ్నమైనది! అవునీ యేనుగును౯ జూచిన౯ దెలియుచున్నది.

**ఎండకు స్రుక్కి, చందనమహీజరసమ్మున మాటిమాటికిన్**
**గండము వెల్లపైచుకొని, కర్ణయుగమ్మను తాళవృంతముల్**
**మెండుగ వీవగన్ మొగము మీద౯, గరోజ్ఝితవారిధారలన్**
**నిండుగ౯ దోగి, హస్తిపతి నిస్తులదుస్స్థితి౯ గ్రాగునట్లగున్. 21**

**(ఇరువురు నిష్క్రమింతురు)**

ఇది శ్రీహర్షుని నాగానందనాటకమునకు

మార్కండేయప్రసాద్ చేసిన ఆంధ్రానువాదమునందు

ప్రథమాంకము.

# నాగానందము

## ద్వితీయాంకము.

**(ఒక పరిచారిక ప్రవేశించును)**

**పరి:** రాజకుమారి మలయవతి నన్నుఁ బిలిచి, 'ఏమే మనోహరికా! మా యన్న మిత్రావసువు నేడేలనో యాలసించెను. పోయి యన్న వచ్చెనో లేదో చూడు' మని పంపినది. **(పరిక్రమించి తెరవైపుఁ జూచి)** ఎవరో యిది ఇంత తొందరగా వచ్చుచున్నది! ఇటే వచ్చు చున్నదే! **(గురుతించి)** ఓహో ! చతురికయే!

**(చతురిక ప్రవేశించును)**

మనో: ఏమే చతురికా! ఏమా తొందర! నన్నుఁగూడ చూడకయే పరువులు బెట్టుచున్నావు!

**చతు:** నీవా మనోహరికా! రాకుమారి మలయవతి నేడు పువ్వులు గోసి కోసి మిక్కిలి యలసి పోయి యున్నదట! శరదాతపముకంటె మిన్న యైన సంతాపముతో బాధపడుచున్నదట! నన్ను బిలిచి, లేత యరటి యాకులు గప్పిన చందనలతాగృహములోఁ జంద్ర కాంతపుఁ దిన్నెను సిద్ధముగా నుంచుమని పంపినది. అది సిద్ధమైనదని యామెకుఁ జెప్పుటకని సత్వరముగాఁ బోవుచున్నాను.

**మనో:** అయ్యో! పాపము! ఐన నాలసింపక పొమ్ము. అక్కడ నైన యామెకు తన తాపము దీరునేమో!

**చతు:** **(నవ్వుకొనుచుఁ దనలో)** ఆ తాపము ఈ రీతిగాఁ దీరునది కాదులే! పైగా రమణీయశీతలచందనలతాగృహములో నొంటిగా నుండెనేని , యా తాపము మరింత విజృంభించును గూడ! **(ప్రకాశముగా)** సరే పద, నేనును రాజకుమారికి చంద్రకాంతవేది సిద్ధమని చెప్పి, యచ్చటకు వెంటఁ బెట్టుకొని పోయెదను.

**(ఇరువురు నిష్క్రమింతురు)**

## ఇది ప్రవేశకము.

**( అంతట నుత్కంఠిత యైన మలయవతియుఁ బరిచారిక చతురికయుఁ బ్రవేశింతురు.)**

**మలయ:** **(తనలో)** మనసా! అప్పుడతనియెదుటనేమో నీవే యట్లు నన్ను లజ్జచే బరాఙ్ముఖినిఁ గావించి , యిప్పుడు నీవు మాత్రము స్వయముగానే యాతనియందే లగ్నమైతివా! ఏమి నీ స్వార్థనిర్వహణపరాయణత! **(ప్రకాశముగా)** చతురికా! గౌరీదేవి యాలయమునకు దారిఁ జూపవే!

**చతు:** **(తనలో)** ఈమె చెప్పుచున్నదేమో దేవీమందిరమునకని, కాని, పోవుచున్నదేమో చందనలతాగృహమునకు. **(ప్రకాశముగా)** అమ్మా! రాకుమారీ! నీవు నడచుచున్నది చందనలతాగృహమువైపు.

**మలయ:** **(లజ్జతో)** అవునే! బాగుగా జ్ఞప్తికిఁ దెచ్చితివి. లతా గృహమునకే పద.

**చతు:** అమ్మా! ఇటు రమ్ము. ఇటు.

**(మలయవతి పేరువైపు నడచును.)**

**చతు:** **(మరలిచూచి, బాధతోఁ దనలో)** అయ్యో! ఎంత పరాకుతో నున్నది! మరల నా దేవీభవనమునకే పోవుచున్నదే! **(ప్రకాశముగా)** రాజకుమారీ! చందనలతాగృహమిటమ్మా, యిటు. ఇటు నా వైపు రమ్ము.

**(మలయవతి సిగ్గుపడి చిరునవ్వుతో అటు నడచును. ఇరువురునుఁ బరిక్రమింతురు.)**

**చతు:** ఇదే చందనలతాగృహము. లోపలికేగి చంద్రమణిశిలా వేదికపైఁ గూర్చుండి యుపశాంతినిఁ బొందుము.

**(ఇరువురును ప్రవేశించి కూర్చుందురు.)**

**మలయ:** **(నిట్టూర్చి, తనలో)** దేవా! కుసుమాయుధా! తన రూప శోభతో నిన్ను నిర్జించిన యాతని నేమియుఁ జేయలేక , యబలనని, యనపరాధనైన నన్ను హింసించుటకు నీకు సిగ్గైనను లేకపోయెఁ గదా! **(తననుదానుఁ జూచుకొని, విరహము నభినయించుచుఁ బ్రకాశముగా)** చతురికా! ఇదేమే, మన యీ చందనలతాగృహము, ఏమాత్ర మెండ జొరకుండఁ జికురుటాకులతోఁగప్పియున్నను,మునుపటి వలె నేడు నాకింకను నించుకైన తాపోపశమనమునుఁ గలిగింప దేమి?

**చతు:** **(చిరునవ్వుతో)** ఈ సంతాపమునకు,ఇది తగ్గకుండుటకుఁ గూడ కారణము నాకుఁ దెలియును. కాని దానిని నీవసంభవమని కొట్టిపారవేయుదువని.

**మలయ:** **(తనలో)** ఇది నన్నుఁ గనిపట్టినట్లున్నదే! **(ప్రకాశముగా)** ఓసీ! అదంతయు నీకెందుకుగాని, నీకుఁ దెలిసిన

కారణమేదియో చెప్పుము.

చతు: అదే నీ యభీష్ట వర ...

**మలయ:** **(సంభ్రమముతో లేచి అటునిటు నడచుచు)** ఏడి,
ఎక్కడ? ఎక్కడతడు ?

**చతు:** అతడెవరమ్మా!

**మలయ:** **(లజ్జతో మొగము వాల్చును)**

**చతు:** అమ్మా! నేననబోయినదిది. 'అదే నీయభీష్టవరమని దేవి
కలలో యానతిచ్చిన' దని నీవు జెప్పిన మరు
నిముస మున నే పూవింటిని వదలి వచ్చిన మన్మథునిఁ
బోలి నీకు దర్శనమిచ్చిన యాతడే నీ యీ
సంతాపమునకుఁ గారణము. కాబట్టియే సహజశీతల
మైన యీ చందనలతాగృహముగాని,దీనిలోని విధుమణి
శిలావేది గాని నీ యుడుకునుఁ బోగొట్టుట లేదు.

**మలయ:** **(చేటి ముంగురులు దువ్వుచు)** నీ పేరే చతురిక మరి. నీ
కడ నేదైన దాచుట నా వశమా! అంతయుఁ జెప్పుదును.

**చతు:** రాజకుమారీ! ఇంకనుఁ జెప్పవలయునా! వరశబ్దము
చెవులఁ బడ్డంతమాత్రమున నీవు పడ్డ యిప్పటి
సంభ్రమమే చెప్పినది. నీవు వేరుగాఁ జెప్ప నక్కరయే
లేదు. సరియే కాని, నీ వేమియు దిగులు పడకుము.
నీవన్నట్లు నా పేరు చతురిక యై, నేను దానికిఁ దగిన
దానినై నట్లైన, యీపాటి కాతడు గూడ నిన్నుఁ జూడక
నిముసమైన నుండఁజాలని దశలోనే యుండి యుండ

వలెను. అతని తీరుమాత్ర మీ చతురిక కంటిని దాటి పోయిన దనుకొంటివా యేమి?

**మలయ:** **(కన్నీటితో)** చేటీ! మనకంత భాగ్యమెక్కడిది?

**చేటి:** అమ్మా! అట్లనకుము. విష్ణువు మాత్రము వక్షమున లక్ష్మి లేక స్వస్థుడై యుండఁగలడా?

**మలయ:** నీవంటి మంచివారు ప్రియముఁదప్ప వేరు బలుకుదురా! అది సరియే కాని మరొక సంతాపము మాత్రము నన్నింతకంటె యెక్కువగా బాధించుచున్నది. మన మాతనిని మాటమాత్రముగ నైనను సమాదరింపక పోయితిమే, దాన నాతడు నన్ను తేలికమానిసిగా నెంచునేమో కదా! **(దుఃఖించును)**

**చతు:** అమ్మా! దుఃఖపడకుము. **(తనలో)** ఐనను దుఃఖముగాక ఇంకేమి? దేహతాపము , మనస్తాపము గలిసి బాధించుచున్నవి. ఏమి జేసిన బాగుండును! ఈ చందన లతాపల్లవరసము నీమె యెదపైఁ బూసెదను. **(లేచి, ఆకులు పిండి రసముఁ దీసి రాచి, ప్రకాశముగా)** ఏడువ కమ్మా రాకుమారీ! నీ వేడికన్నీ రాగక పడుటచేత యీ నవచందనరసముగూడ వేడెక్కుచున్నది చూడుము. ఇక నీ తాపమెట్లు మానును? **(అరటియాకుతో వీచును)**

**మలయ:** **(చేతినడ్డుపెట్టి)** వలదు వలదు. వీచకుము . ఈ యాకు గాలి యెంత వేడిగా నున్నదో!

**చతు:** అమ్మా! ఇది దీని తప్పుగాదు.

**సాంద్రచందనపల్లసంగ మహిమ**

**మిగులశీతలతరమైనమేలి బాల**

**కదళికాదళమారుత మిదియు, వెచ్చ**

**జేయుచుంటి, నీ యూర్పులఁ జేసి నీవె. 22**

**మలయ:** సఖీ! ఈ దుఃఖమున కొక నివారణమేమైన గలదా!

**చతు:** లేకేమి? ఉన్నది. ఆతడిక్కడకు వచ్చినయెడల.

**(అంత విదూషకునితోఁ గలసి జీమూతవాహనుడు బ్రవేశించును)**

**జీమూతవా:**

**అమ్మెయి మోముఁ ద్రిప్పి, రుచిరాక్షి, సితాసితగాఢదీధితుల్**

**గ్రమ్మెడు కన్నులన్, దరువులన్ మృగచర్మములారగట్టిన**

**ట్లమ్మని ముందె నన్నుఁ గనినట్టి విలాసపువాలుఁజూపు కే**

**బమ్మెరవోతి, సూనశర! వ్యర్థము నీ శరరాజి నాపయిన్. 23**

**విదూ:** మిత్రమా! ఎంత ధీరుడ వెంత ధైర్యహీనుడవైతివి? నీ ధీరత్వ మంతయు నెటు వోయినది?

**జీమూతవా:** వయస్యా! ధైర్యహీనుడనా! ఎట్లయ్యా?

**నిండుచందురుడుబ్బి పండువెన్నెలఁ గాయు**

**కటికి రాత్రులఁ బెక్కు గడపలేదె !**

**ప్రసవబాణునిచేతి ప్రథమశస్త్రంబంచుఁ**

**గొంకకఁ దమ్మి మూర్కొంటిఁ గాదె!**

**మాలతీసౌరభ్య మహితమందానిల**

**మ్ములకు మాపటి వేళఁ దలకినానె!**

**కమలాకరములందు గండుతుమ్మెదపిండు**

**ఝుంకారములు వించుఁ జంకినానె!**

**రేబవళ్ళిట్లు విరహిసైరింపలేని**

**పెక్కు దుష్కరక్రియలఁ గావించు నన్ను**
**నిత్యసంగివై చూచుచుండియును నీవు,**
**ధైర్యహీనుడవని పల్క ధర్మ మగునె? 24**

లేదా, నీవన్నదిమాత్ర మసత్యమా? అధీరుడనే!

**దేహవిహీనుని సూనశ**
**రాహతి సహియింపలేక యసురుసురై, నీ**
**వే హసియింపగఁ బొగిలెడు**
**స్త్రీహృదయుడ నెట్టులందు ధీరుడననుచున్?25**

విదూ: **(తనలో)** ఈతని యధీరత్వమే యీతని కొందలమును దెలుపుచున్నది. కనుక మాట మార్చి చూచెదను. **(ప్రకాశముగా)** వయస్యా! ఈనాడెందుకు పితృసేవ త్వరగా ముగించి యీ చోటికి జేరితివి?

జీమూతవా: సరిగా యడిగితివి. నీకుగాక యెవరికి జెప్పుదును గాని, వినుము. రాత్రి కలలో యామె, నిక్కముగా యామె యే, అగపడినది. **(చూపుచు)** అదిగో! ఆ చందనలతా గృహమున చంద్రకాంతవేదికపై కూర్చుండి, ప్రణయ కోపముతో నన్నేమేమో యుపాలంభించుచు దుఃఖించుచున్నట్లు కనఁబడినది. కనుక కలలో ప్రియాసమాగమమును గలిగించి నాకుఁ గడు రమ్యమైన యీ చందనలతాగృహముననే యీ దివసశేషమును గడపి పోదమని యిక్కడకు వచ్చితిని. రమ్ము పోవుదము. **(పరిక్రమింతురు)**

చతు: **(చెవి యొగ్గి)** రాజకుమారీ! అడుగుల చప్పుడు వలె

వినబడుచున్నది.

**మలయ:** **(తననుదాను జూచుకొని, సంభ్రమముతో)** చేటీ! నా యీ యాకారమును జూచినయెడల నెవ్వరికైన విషయమర్థ మగును. లెమ్మి అరుణాశోకవృక్షము మాటున నుండి యీ వచ్చుచున్నదెవరో చూతము. **(ఇరువురును దాగి యుందురు.)**

**విదూ:** వయస్యా! ఇదే యా నీ చందనలతాగృహము. రమ్మి లోనికి బోవుదము. **(ఇరువురును బ్రవేశింతురు)**

**జీమూతవా:**

**చందనలతాగృహ,మ్మిది**
**యిందుశిలాసహితమయ్యు , నిందువదనలే**
**కిందురహితప్రదోషము**
**చందము నస్ నాకు సంతసమునిడదు సుమీ! 26**

**చతు:** **(వారినిఁ జూచి)** అమ్మా! రాజకుమారీ! నీ యదృష్టము! వెదకఁబోయిన తీగ కాలికే తగిలినది. వచ్చినవాడు నీ మనసు మెచ్చిన వాడే!

**మలయ:** **(తొంగి చూచి, సంతసముతో, తడబాటుతో)** అమ్మో! కంటబడుదుమేమో యని నాకుఁ గడు భయముగా నున్నది. ఇక్కడనుండజాలను పద వేరొక చోటికిఁ బోదము. **(తత్తరముతో నడువఁ బోయి)** ఏమే! నాకుఁ గాళ్ళు వడకుచున్నవే! కాలు సాగుట లేదు.

**చతు:** **(నవ్వి)** ఎంత భయమో! రాజకుమారీ! ఇక్కడెక్కడనో మాటున డాగి యున్న నిన్నెవ్వడు చూచును? మధ్యలో యశోకవృక్షము మాటున్నది మరచితివా యేమి?

ఇక్కడే యుందము. **(అక్కడే యుందురు)**

**విదూ:** **(చూపించుచు)** మిత్రమా! ఇదే నయ్యా ఆ కాంత చంద్రకాంతవేదిక.

**జీమూతవా:** **(కన్నీరు నించి ,నిట్టూర్చును)**

**చతు:** అమ్మా! రాకుమారీ! ఏదో ఇదే యనియు, కాంత యనియు వినఁబడుచున్నది, శ్రద్ధగా విందము.

**విదూ:** **(చేత బట్టి కుదుపుచు)** మిత్రమా! ఇదే యా కాంత చంద్రకాంతవేదిక యని చెప్పుచున్నాను, వింటివా?

**జీమూతవా:** **(నిట్టూర్చి, కన్నీరు రాల్చుచు)** అవునవును. బాగుగా గురుతు పట్టితివి. **(చేత జూపుచు)**

**ఉడుగక యూరుపుల్ నిగుడుచుండగ, నెంతకు రాని నాపయిన్**
**బొడమిన కిన్క పెల్వరచు భ్రూచలనమ్ములతోడ, నెట్టులే**
**నడచుచు నెవ్వగన్, వికలమైన మొగమ్మునుఁ గేలనూది, బి**
**ట్టడలుచు నేడ్చు కాంత గననయ్యె నిటన్ శశికాంతవేదిపై.** 27

ఈ చంద్రమణిశిల మీదనే గూర్చుందము రమ్ము.

**(ఇరువురు గూర్చుందురు)**

**మలయ:** **(సాలోచనముగా)** ఆమె ఎవరై యుండవచ్చును?

**చతు:** ఇప్పుడు మనము చాటునుండి యాతనిని జూచినట్లే యాతడుగూడ యింతకు ముందిక్కడ మనము తిన్నెపై నున్నప్పుడు నిన్ను చాటునుండి చూచియుండును.

**మలయ:** ఐనఁ గావచ్చును. కాని, ప్రణయకుపితయైన వల్లభ నెవతెనో యుద్దేశించి మాటలాడుచున్నాడే!

**చతు:** రాకుమారీ! ఏలనమ్మా యీ కుశంకలు? ఆగు మింకను

విందము.

**విదూ:** **(తనలో)** ఇతని కీ ప్రసంగము రుచించుచున్నట్లున్నది. సరే కానిమ్ము మాటలనే సాగింతును. **(ప్రకాశముగా)** వయస్యా! ఆ విధముగా నేడ్చుచున్న యామెతో నీ వేమియు మాటాడలేదా!

**జీమూతవా:** ఇట్లంటిని.

**నీవు దొరగించుచున్న కన్నీటఁ దడిసి**
**తెరవ! యీ చంద్రకాంతవేదిక, త్వదాస్య**
**పూర్ణచంద్రబింబోదయమ్మున స్రవించు**
**చున్న రీతిగాఁ గాన్పించు చున్న దంటి. 28**

**మలయ:** **(రోషముతో)** చతురికా! ఇంకను వినవలయునా? రమ్ము మన దారినఁ బోవుదము.

**చతు:** **(చేయి పట్టి నిలిపి)**అమ్మా! రాజకుమారీ! వలదు వలదు. నిన్ను కంటఁజూచిన యీతడు మరొక్కతెనుఁ దలచి యిట్లనుచున్నాడనిన నమ్మఁ జాలను. కనుక చివర వరకు విందము, నిలువుము.

**మలయ:** నాకు మాత్ర మట్లనిపించుట లేదు. సరే కానిమ్ము, నీవన్నట్లు కడదాక విందము.

**జీమూతవా:** వయస్యా! ఈ శిలావేది మీదనే యామె చిత్తరువును వ్రాసి, దానినిఁ జూచుకొనుచు మనసునకుఁ గొంత యూరటఁ గలిగించుకొనవచ్చు ననిపించుచున్నది. కనుక నీవేగి యీ చెంగట గిరితటమునుండి మనశ్శిల ముక్కలనుఁ దీసికొని రమ్ము.

**విదూ:** అట్లే.**(నిష్క్రమించి, మరల బ్రవేశించి)** మిత్రమా! ఇవిగో! నీవు జెప్పిన ఒక్క మనశ్శిలయే కాదు. కొండ చరియ పై వెదకి యైదు రంగుల రాళ్ళనుఁ దెచ్చితిని. ఇక బొమ్మ గీయుము.

**జీమూతవా:** వయస్యా! లెస్సగాఁ దెచ్చితివి. **(అవి దీసికొని బొమ్మ గీయుచు, పులకితుడై)** మిత్రమా! చూడు! ఇటు జూడు!

**అచ్ఛబింబశోభాధరమ్మగుచు, నేత్ర**
**పర్వమై యొప్పు శశిరేఖ పగిది, మదికి**
**హాయి గలిగించు నాకుఁ ; బ్రియాస్యరచన**
**లిఖితమై కానఁబడు తొలిరేఖ గూడ.** 29

**విదూ:** **(ఉత్సుకతతో బరిశీలించి)** వయస్యా! ఎదుట లేకున్నను నింత పోలిక పొంతనతో గీయుట మిక్కిలి యబ్బురము !

**జీమూతవా:** **(చిరునవ్వుతో)** మిత్రమా! ఎదుట లేదననేల?

**అంతః కరణనిరంతర**
**చింతనలస్ సన్నిహితయ చెలి, యా రూపుస్**
**సంతతముఁ జూచి చూచి యొ**
**కింత రచించితిని చిత్ర, మిది యబ్బురమా? 30**

**మలయ:** **(నిట్టూర్చి, కన్నీటితో)** చివరివరకు వింటిమి గదా! తెలిసినది గదా! పద, అన్న మిత్రావసువుకడకుఁ బోవుదము.

చతు: **(బాధతో, తనలో)** ఈమె మాటలు జూడ బ్రదుకు మీదనే విరక్తి బుట్టినట్లున్నవి. **(ప్రకాశముగా)** రాజకుమారీ! మనోహరిక అక్కడకే కదా పోయినది! ఇంతట నంతట

యన్నగారే యిటు రావచ్చును. కొంచెమాగుము.

**(అంతట మిత్రావసువు ప్రవేశించును)**

మిత్రా: మా చెల్లెలు మలయవతి వివాహసంబంధవిషయమై మా తండ్రిగారు నాతో, "నాయనా! మిత్రావసూ! చిరకాలము సన్నిహితనివాసి యై యుండుట చే జీమూతవాహనుని లెస్సగాఁ బరిశీలించితిమి.తగిన వరుడని నిర్ణయించితిమి గనుక నీవేగి యాతనికి మలయవతి నిచ్చుటకై మాట లాడి ర" మ్మని యానతిచ్చిరి. చెల్లెలిమీది ప్రేమచేత నాకు మాత్రము కొంత యుద్వేగముగానే యున్నది. ఏమనిన,

**సాధుజనేష్టుడున్, వినయశాలియు, వీరుడు, సుందరుండు, వి**
**ద్యాధరరాజవంశమణి, ప్రాజ్ఞుడు, యౌవనశోభి, వర్యుడే;**

కాని,

**బాధితసత్వరక్షణకుఁ బ్రాణములైన నిడున్ దయార్ద్రి; నా**
**సోదరి నిట్టి త్యాగికిడుచో ముదమున్ దిగులున్ జనించెడిన్.** 31

ఇప్పుడాతడీ చెంగట గౌర్యాశ్రమము పొంత చందనలతా మండపములో దనమిత్రునితో గలిసి యున్నాడని తెలిసినది. ఇదే యా చందనలతామండపము.

**(పరిక్రమించి, ప్రవేశించును)**

విదూ: **(చూచి, సంభ్రమముతో)** మిత్రమా! సిద్ధయువరాజు మిత్రావసు వెందులకో యిటే వచ్చుచున్నాడు . అతని కంటబడునేమో యీ యువతి చిత్రము నీ యరటి యాకులతోఁ గప్పివేయుము.

**(జీమూతవాహనుడు బొమ్మను మూసివేయును)**

**మిత్రా:** **(సమీపించి)** కుమారా! నేను మిత్రావసువును, నమస్కారము.

**జీమూతవా:** **(చూచి)** మిత్రావసూ! స్వాగతము. రమ్మిటు వచ్చి కూర్చుండుము.

**చతు:** అమ్మా! మీ యన్నగారే వచ్చినారు.

**మలయ:** సంతోషమే.

**జీమూతవా:** మిత్రావసూ! సిద్ధరాజు విశ్వావసులవారు కుశలులే కదా!

**మిత్రా:** తండ్రిగారికి క్షేమమే.వారి సందేశమును మీకుఁ జెప్పుటకే నేను వచ్చితిని .

**జీమూతవా:** **(గౌరవముతో)** ఏమని వారి సందేశము?

**మలయ:** **(కుతూహలముతో)** తండ్రిగారి సందేశమట! ఏమో యది, విందును.

**మిత్రా:** కుమారా! తండ్రిగారి సందేశమిది. "జీమూతవాహనా! మా సిద్ధరాజవంశమునకే ప్రాణసమాన యైన నా కూతురు మలయవతిని నీ కీయ దలచి ప్రతిపాదించు చున్నాను. పరిగ్రహింతువు గాక." అని.

**చతు:** **(నవ్వి)** ఏమమ్మా! ఇప్పుడు రాలేదేమి కోపము?

**మలయ:** **(సిగ్గుతో చిరునవ్వుతో తలవంచుకొని)** చేటీ! అప్పుడే సంతసమా?ఆతని యన్యహృదయత్వమును మరచితివా యేమి?

**జీమూతవా:** **(అపవారించి)** మిత్రమా! ఇరుకునఁ బడితిమే!

**విదూ:** **(అపవారించి)** నీ మన సామెనుదప్ప మరియొకరిని

గోరదని నాకును దెలియును. ఐనను, మరి, యేదో యొకటి చెప్పి యూతనిని బంపి వేయుము.

*(పై అపవారణాలు కేవలం మిత్రావసువునకే అని గమనించాలి. లేకపోతే, మలయవతి ఆ మాటలను వినటము,వాటికి ప్రత్యుక్తి చెప్పటము, కుదరవు .)*

**మలయ:** **(కోపముతో తనలో)** మాయలమారీ! ఎవరికిఁ దెలియని కథ యని?

**జీమూతవా:** మిత్రావసూ! ప్రశస్తమైన మీ సంబంధము నెవడు మాత్రము గోరుకొనడు? కాని యొకపట్ల లగ్నమైన మనస్సు నింకొక వైపునకు , మరలించుట యశక్యము. కాబట్టి నేనీమెను బ్రతిగ్రహింప నొప్పుకొనఁజాలకున్నాను.

**(మలయవతి మూర్ఛిల్లును)**

**చతు:** రాజకుమారీ! ఊరడిల్లుము. తేరుకొనుము.

**విదూ:** అయ్యో! ఇతడా, యస్వతంత్రుడు, తండ్రిచాటు వాడు ! విషయమా, వివాహము! కావున నీతని మాటలతో నేమి? పోయి యితని తల్లిదండ్రుల నడుగుము.

**మిత్రా:** **(తనలో)** మంచి మాట. ఇతడెట్లును తండ్రిమాట మీర లేడు. అతని నివాస మీ గౌర్యాశ్రమమునందే . కనుక పోయి యాయననే యడిగి మలయవతిని వారి కోడలిగా స్వీకరింపఁ జేసెదను.

**మలయ:** **(మూర్ఛ తేరి చూచును)**

**మిత్రా:** మా యభీష్టమును దెలిపితిమి. కాదనుటను గురించి యువరాజునకే బాగుగా దెలియును.

**మలయ:** **(రోషముతో)** అడిగి కాదనిపించుకొన్న గౌరవము చాల

| | |
|---|---|
| | దని కాబోలు, అన్న యింకను నేదియో మాటలాడు చున్నాడు! |
| **మిత్రా:** | **(నిష్క్రమించును)** |
| **మలయ:** | **(దుఃఖముతో, తననుఁదాను జూచుకొనుచు)** దౌర్భాగ్యకళంకితము, దుఃఖభాగియు నైన యీ పాడు శరీర మిక యెందులకు? ఈ రక్తాశోకవృక్షమునకే యీ మాధవీలతతో యురిఁ బెట్టుకొని నా కథను ముగింతును. దీనికిట్లు చెప్పెదను. **(ప్రకాశముగా, రాని నవ్వుతో)** చేటీ! నీవు పోయి, అన్న కొంత దూరము పోయినదాక నిలిచి చూచి,వచ్చి నాకుఁ జెప్పుము.మనమునుఁ బోవుదము. |
| **చతు:** | రాకుమారి యానతి. **(కొన్ని యడుగులు నడచి,తనలో)** ఈమె తీరునుబట్టి చూడగా యీమె కేమో వేరే తలపున్న ట్లున్నది. ఎందుకైనను మంచిది, పోవక యిచ్చటనే దాగి యీమె యేమి చేయునో చూచెదను. |
| **మలయ:** | ఈ పాటికి చతురిక దూరముగఁ బోయి యుండును. **(లేచి మెడకు తీగలు దగిలించుకొని)** భగవతీ! గౌరీ! ఈ జన్మమున నీ దయ రాలేదు. మరి రాబోవు జన్మమున నైనను నన్నిట్టి దుఃఖభాగినిగాఁ జేయకుము. |
| **చతు:** | **(చూచి, సంభ్రమముతో)** అయ్యయ్యో! కాపాడుడు. రండు, కాపాడుడు. ఇదే మా రాజకుమారి యురిఁ బెట్టుకొను చున్నది! |
| **జీమూతవా:** | **(అదరిపడి లేచి)** ఎవరు? ఎవరది? ఎక్కడ? ఎక్కడ? |
| **చతు:** | ఇక్కడనే! ఈ రక్తాశోకమునకే. |

**జీమూతవా:** **(త్వరగా వచ్చి చూచి, ఆనందముతో)** ఏమిది? ఆమెయే! నా వాంఛాసర్వస్వమే! **(మలయవతి చేతిని౽ బట్టి యాపి, తీగలను లాగి వేయుచు)**

**వలదిది మానినీ వలదు; పాపపు సాహసమేల నీకు౽? బు**
**ష్పలవనమైన నోర్వని భవన్మృదుపల్లవతుల్యపాణినిన్,**
**బలవదసుప్రహారిగళపాశము౽ బూనగ౽ జేయ న్యాయమే**
**తొలగు, లతన్ ద్యజింపు. తరితో సుఖముల్ దనువున్ననే కదా! 32**

**మలయ:** **ఛీ ఛీ! ఎవరితడు? (జీమూతవాహనుని జూచి గుర్తించి, రోషముతో౽ జేతిని లాగుకొనుచు) వదలుము, నా చేయి** వదలుము. నన్నాపుటకు నీవెవరవు? చచ్చుటకు౽ గూడ నీ యంగీకారమే కావలయునా నాకు?

**జీమూతవా:** నేను వదలను.

**ఆణిముత్తెపు సరులకే యర్హమైన**
**యట్టి నీమెడ, నురిత్రాటి౽ జుట్టుచుండి**
**నాకు౽ జిక్కిన యపరాధి నీ కరమ్ము,**
**నేను తగురీతి దండింప కెట్లు విడుతు? 33**

**విదూ:** అమ్మా! ఈమె బలవన్మరణప్రయత్నమున కేమి కారణము?

**చతు:** **(నర్మగర్భముగా)** ఈ మీ మిత్రుడే కదా!

**జీమూతవా:** **(అనునయముతో)** నేనా కారణము? నాకేమియు౽ దెలియుట లేదు.

**విదూ:** అమ్మా! ఇదెట్లు?

**చతు:** మీ మిత్రుడు తన హృదయవల్లభ దెవ్వరిదో బొమ్మ నీ వేదికపై జిత్రించుకొనినాడు. తాను వలచిన యామె పై గల ప్రేమాతిశయముచేత మిత్రావసువుతో తానీమెను గైకొనఁ జాలనని చెప్పుచుండగా విని, విషాదముతో విరక్తయై యిట్లు సాహసించినది.

**జీమూతవా:** **(సంతోషముతో తనలో)** ఏమీ! ఈమె యేనా యా విశ్వావసువు పుత్రిక మలయవతి? అవునులే, చంద్రలేఖ రత్నాకరమునుండి గాక మరెక్కడ పుట్టును? అబ్బా! మోస పోయితినే!

**విదూ:** ఓహో! అదియా సంగతి! తల్లీ! అట్లైన మా మిత్రు డనపరాధుడే. నమ్మవేని నీవే వచ్చి యా యరుగుమీద నేమున్నదో చూడుము.

**మలయ:** **(సిగ్గు, సంతోషములతో జీమూతవాహనుని జూచుచు, చేయి విడిపించుకొన బోవును)** నా చేయి-వదలుడు.

**జీమూతవా:** **(చిరునవ్వుతో)** వదలను గాక వదలను. నీవు వచ్చి యా వేదిక మీద నున్న నా హృదయవల్లభ చిత్రమునుఁ జూచినదాక వదలను.

**(అందరు బరిక్రమింతురు)**

**విదూ:** **(కప్పియున్న యరటి యాకులు దొలగించి)** ఈమెయే యితని హృదయవల్లభ.

**మలయ:** **(చూచి, అపవారించి, చిరునవ్వుతో)** చతురికా! బొమ్మ నావలె నున్న దేమే!

**చతు:** **(మలయవతిని, చిత్రమును పరిశీలించుచు)** అమ్మా!

ఏమంటివి? నీ వలె నున్నదనియా! నాకేమో, నీ రూపము చిత్రితమైనదో లేక యీ చంద్రకాంతశిలలో బ్రతిఫలించినదో తెలియనంత సాదృశ్య మగపడుచున్నది!

**మలయ:** **(నవ్వి)** ఈ బొమ్మను జూపి మోసగించి మనలను మరింత సిగ్గిలఁ జేసినాడే!

**విదూ:** ఓ వయస్యా! గాంధర్వపాణిగ్రహణము జరిగియే పోయినది. ఇక యామె చేతిని వదలుము. ఎవరో ఒక యామె యిటే త్వరత్వరగా వచ్చుచున్నది!

**(జీమూతవాహనుడు చేతిని వదలును. చేటి సంభ్రమముతో బ్రవేశించును)**

**చేటి:** అమ్మా! రాకుమారీ! రాకుమారీ! జీమూతవాహనుని తల్లిదండ్రులు నిన్నుఁ దమ కోడలిగాఁ బరిగ్రహించినారు.

**విదూ:** **(గంతులు వేయుచు)** ఆహాహా! నా మిత్రుడు జీమూత వాహనుని కోరిక దీరినదహో! కాదు కాదు, సిద్ధరాజ కుమారి మలయవతి కోరిక దీరినది.అహహ,ఏదియునుఁ గాదు. **(పొట్ట నిమురుకొనుచు)** ఈ బ్రాహ్మణుని కోరికయే తీరినది.

**చేటి:** **( మలయవతితో)** అమ్మా! "ఈ నాడే మలయవతి వివాహము. కనుక త్వరగా నామెనుఁ దీసికొని రమ్ము." అని యువరాజు మిత్రావసువులవారి యానతి. కనుక వెంటనే నాతో రమ్ము.

**విదూ:** ఏమే తొత్తుకాన! మీ రాకుమారి నేమో నీవు దీసికొని పోయెదవా! మా యువరాజేమో యిక్కడ యొక్కడే నిలువ వలయునా?

**చేటి:** **(నవ్వు నాపుకొనుచు)** నీ కక్కురితి కాలిపోను! తొందర పడకుము. మీకును మంగళస్నానద్రవ్యములు వచ్చుచునే యున్నవి లే!

**(మలయవతి అనురాగముతో సిగ్గుతో జీమూతవాహనునిఁజూచుచు, పరివారముతో నిష్క్రమించును)**

**(నేపథ్యమున వైతాళికుడు చదువును)**

**చందనాద్రికి మేరు సమకాంతిఁ గలిగింపఁ**
**జాలు బుక్కాపొడుల్ జల్లుకొనుచు,**
**ప్రథమసంధ్యాతప ప్రభల మించెడు క్రొత్త**
**చెందిరమ్ములను మైఁ జిమ్ముకొనుచు**
**బహుకాలకాంక్షిత ప్రాప్తిహర్షమ్మున**
**నవశులై సయ్యాటలాడుకొనుచు**
**అన్యోన్యనామగ్రహాహ్వానదర్శితో**
**త్సవకాలసముచితోత్సాహమగుచు**
**సిద్ధలోకంబు నీ శుభసిద్ధిఁ గోరి**
**రణరణత్పాదనూపురారావహృద్య**
**యౌవతోద్గీతములఁ దెల్పునయ్య నీకు**
**సమయ ముద్వాహమంగళస్నానమునకు.34**

**విదూ:** **(విని)** మిత్రమా! ఇదిగో స్నాతకద్రవ్యము వచ్చినది.

**జీమూతవా:** **(సంతోషముతో)** ఐన నింకను నిక్కడ బని యేమి? పోయి తల్లిదండ్రులకు నమస్కరించి వారి యాశీస్సుల నంది ,స్నానశాలకుఁ బోవుదము, పద.

**తుల్యకులవయోరూపరక్తులను గలిగి**

యుండినను, కొద్ది మంది ధన్యులకుఁ దప్ప
యొండొరులఁ జూచుకొని ధృతాన్యోన్యకాంక్ష
నైన సంబంధ మేర్పడ దని తలంతు. 35

(ఇరువురును నిష్క్రమింతురు.)

ఇది శ్రీహర్షుని నాగానందనాటకమునకు
మార్కండేయ ప్రసాద్ చేసిన ఆంధ్రానువాదమునందు
ద్వితీయాంకము.

-*-

# నాగానందము

## తృతీయాంకము

**(అంతట చేతిలో మద్యపాత్రముతో , వికటవేషముతో , చెడద్రావి యున్న విటుడు శేఖరకుడును భుజముపై కల్లుకుండతో చేటుడును బ్రవేశింతురు.)**

**విటు:** **(తూలుచు)**

**అనిశమ్ముఁ గల్లుఁ ద్రావుచుఁ**
**దనిసెడు బలదేవుడుఁ, బ్రియతరుణీ సంగం**
**బునొసంగు కామదేవుం**
**డును,నా దేవులు,తదన్యుడును దేవుండే?36**

**(తడబడుచు)** ఓరీ శేఖరకా! విటశేఖరకా! నీ బ్రదుకు పండినదిరా! ఎందుకు? ఏమి రా కారణము?

**ఎదఁ దమి వ్రాలిన దయితయు,**
**మదనావహపద్మగంధమదిరయు నోటన్,**
**ఇదె తలపై విటశేఖర**
**పదసూచనశేఖరమును బరగుట నెపుడున్.37**

అరే , యెవడు రా నన్ను నెట్టుచున్నాడు?నా నవమాలిక నన్నేమైన యాటఁ బట్టించుచున్నదా యేమి!

**చేటు:** స్వామీ! వనమాలిక యింకను రానే లేదు.

**విటు:** **(కోపముతో)** ఏమీ! ఇంకను రాలేదా? మలయవతీ వివాహోత్సవమేమొ తొలిజామునసే యై పోయినది. తెల్లవార వచ్చినను నవమాలిక యేల రాలేదు? **(సంతోషముతో)** అది సంగతి! ఈ యుత్సవములో సిద్ధ

విద్యాధరులందరునుఁ దమ తమ ప్రియురాండ్రతోఁ గలిసి కుసుమాకరోద్యానములోఁ బానగోష్ఠిఁ జేసికొనుచున్నారు గదా! నా నవమాలికగూడ నాకొర కక్కడనే కనిపెట్టుకొని యున్నది గాబోలు! తొందరగా కుసుమాకరవనమునకుఁ బోవుదము పద! ప్రక్కన నవమాలిక లేని శేఖరకుడు శేఖరకుడా!నడువవేమి రా!**(తూలుచుఁ బరిక్రమించును)**

చేటు: అయ్యా! ఇదిగో కుసుమాకరవనము, వచ్చితిమి. లోపలకుఁ బోవుదము.

**(ఇరువురును బ్రవేశింతురు)**

**(అంతట సేలువుల చాపును బుజముపైన వైచుకొని విదూషకుడు ప్రవేశించును.)**

**విదూ:** నా ప్రియవయస్యుడు కుసుమాకరోద్యానమునకుఁ బోవుచున్నాడని తెలిసినది. నేను నక్కడకే పోయెదను. **(పరిక్రమించి)** ఇదే యుద్యానము. లోపలికి బోవుదును. **(వెనుకకు తగ్గి)** ఏమీ యీ పాడు తుమ్మెదలు నా మీద మూగుచున్నవి? **(తన మేను మూచూచుకొని)** ఆఁ, తెలిసినది. మలయవతి బంధువులందరుఁ గలిసి, యల్లుడుగారి మిత్రుడనని గౌరవించుచు, నాకుఁ బెక్కు పరిమళద్రవ్యములనుఁ బూసి, రంగులు బులిమి, తలపైన సంతానకుసుమమాలికాకిరీటమునుఁ గూడ బెట్టిరి. వాని వాసనలకే యీ తుమ్మెదలు నా పైన మూగుచున్న వన్నమాట!అప్పటి యా అత్యాదరసత్కార మిప్పుడీ తిప్పలఁ దెచ్చిపెట్టినది. సరే! మలయవతి

నాకిచ్చిన యీ ఎర్ర సేలువులతో స్త్రీ వలె యాపాద మస్తకము గప్పుకొని ,యుత్తరీయముతో నవగుంఠము వైచుకొని పోయెదను. ఈ తొత్తు తుమ్మెదలప్పుడేమి జేయునో చూచెదను. **(ముసుగు వైచుకొనును)**

విటు: **(చూచి, చేటునితో సంతోషముతో)** ఓరీ! చేటా! **(ప్రేలితో జూపుచు, నవ్వుచు)** అదిగోరా నా నవమాలిక!ఆలసించితి నని నాపైఁ గోపించి,నా కంటఁ బడకుండవలెనని, ముసుగు వైచుకొని ప్రక్కకు దాటుకొనుచున్నది రా! కౌగిలించి, లాలించి బుజ్జగించెదను. **(పరుగునఁ బోయి విదూషకునిఁ గౌగిలించుకొని నోటిలోని తాంబూలమును నోటి కందీయఁ బోవును.)**

విదూ: **(ముక్కు మూసుకొని, పెడమరలి)** ఛీ ఛీ! కల్లు వాసన! ఒక మధుపసంకటము దప్పించుకొని నే నింకొక మధుపసంకటములోఁ జిక్కుకొంటినే!

విటు: అయ్యయ్యో! కోపముతోఁ బెడమొగముఁ బెట్టుచున్నదే! **(కాళ్ళపైఁ బడి )** ఓ నవమాలికా! నా నవమాలికా! కోపము మానుము. దయజూడుము, దయజూడుము.

**(అంతట చేటి నవమాలిక ప్రవేశించును)**

నవ: రాణిగారు నాతో 'నవమాలికా!అల్లుడుగారు రాజ కుమారితోఁ గలిసి కుసుమాకరోద్యానమునఁ దమాల వాటికకు వచ్చుచున్నారు గావున దానిని సుందరముగఁ దీర్చు' మని వనపాలిక యైన పల్లవికకుఁ జెప్పు మనిరి. దానికా మాటఁ జెప్పివైచినాను గనుక, యిక రాత్రి

యంతయు నా కొరకు వేచి వేచి విరహముతో వేగుచున్న నా ప్రియుడు శేఖరకుని వెదకెదను. **(అటు నిటుఁ జూచి)** వీడే శేఖరకుడు. ఇక్కడనే యున్నాడు. **(రోషముతో)** ఆఁ! ఏమిది? ఎవతెనో బతిమాలుకొనుచున్నాడు! సరే, ఇక్కడనే మాటు పైచి యిది యెవ్వతెయో చూచెదను.

**విట:**

**హరిహరపితామహులకైన నెరగ లెక్క**
**గొనని గర్విని, శేఖరకుండ నేను,**
**మ్రొక్కెదను నవమాలికా! పెక్కు మార్లు**
**నీ పదమ్ములఁ దలమోపి నీవు మెచ్చ. 38**

**విదూ:** తొత్తు గాడిదా! తాగుబోతా! ఇక్కడ నీ నవమాలిక యెక్కడరా!?

**చేటి:** **(పరిశీలించి)** అయ్యో! మత్తులో మునిగిన శేఖరకుడు నన్ననుకొని ఆత్రేయునిఁ బట్టుకొని బతిమాలుకొను చున్నాడు.కానీ, నేనుఁగూడ యేమియుఁ దెలియనట్లు కోపము నటించుచు, నిరువురనుఁ కొంచె మాటఁ బట్టింతును. **(పరిక్రమించును)**

**చేటు:** దొరా! వదలుము వదలుము. ఈమె నవమాలిక గాదు. నవమాలిక యిదిగో! యిటువైపునుండి కోపముతో యెర్రబడిన కన్నులతో నిన్నుఁ జూచుచు వచ్చుచున్నది!

**నవ:** **(సమీపించి)** శేఖరకా! ఎవతెను బతిమాలుకొను చున్నావు?

**విదూ:** **(ముసుగు దీసి)** దిక్కుమాలినవానిని  నన్ను!

విటు: **(విదూషకునిఁ జూచి)**అరే! ముసలికోతీ! నీవా? నీవుగూడ, నన్ను, శేఖరకునిఁ, గేలిజేయునంత వాడవా! ఓరీ! చేటా! నేను నవమాలికను బుజ్జగించుకొనునంతవరకు నీవు వీనినిఁ బోనీక పట్టుకొని యుండుము రా!

చేటు: అట్లే!

విటు: **(విదూషకుని విడిచి, నవమాలిక పాదములపైఁ బడి)** నవమాలికా, నా నవమాలికా! ఓ నవమాలికా! దయ జూడుము నాపై దయఁ జూపుము.

విదూ: ఇదే నాకు పారిపోవుట కదను . **(పారిపోఁ బోవును)**

చేటు: **(జందెముఁ బట్టుకొని యాపును. జందెము తెగిపోవును)** ఓరి పండుకోతీ!ఎక్కడకు? ఎక్కడకుఁ బారిపోయెదవురా?

విదూ: అమ్మా! నవమాలికా! నా మీద దయ యుంచుము. నన్ను విడిపింపుము.

నవ: అట్లే విడిపింతును. **(నవ్వి)** నా కాళ్ళపై తలమోపి పడి వేడుకొందువా మరి?

విదూ: రాజసఖుడనై యుండి నేను,తొత్తుదానా!నీ పాదములపైఁ బడుదునా?

నవ: **(వ్రేలఁజూపి బెదరించుచు)** ఇప్పుడే నిన్నుఁ బడునట్లుఁ జేసెదను. చూడుము. శేఖరకా! లెమ్ము. నా కోపము పోయినది లే! కాని యీ యాత్రేయుడు రాజుగారి యల్లుడుగారి ప్రియమిత్రుడు గదా! అంత ముఖ్యమైన వాని నిట్లేడ్పించితివని యువరాజు మిత్రావసువు నీపై గోపించునేమో కదా! కనుక యీతనిని గౌరవముతో

సమ్మానింపుము.

**విటు:** నా నవమాలిక యేది జెప్పిన నదియే. **(విదూషకునిఁ గౌగిలించుకొని)** అయ్యా! నీవు మా వియ్యపు బంధువ వగుటచే నేదో కొంత పరిహసించితిని. అంతే కాని, నిజముగా పరిహాసము గాదు. **(తూలుచు)** ఏమిరా, శేఖరకా! నిజము జెప్పుము. నీవు నిజముగానే యాత్రేయునిఁ బరిహసించితి వటరా! **(ఉత్తరీయమును కుదురు జుట్టి నేలపైఁ బెట్టి)** అయ్యా! ఆత్రేయా! నీవు మా వియ్యపు జుట్టమవు గదా! ఇందు గూర్చుండి మమ్ము మన్నింపవలయును.

**విదూ:** **(తనలో)** అమ్మయ్య! వీనికి మత్తు కొంత దిగినట్లున్నది. **(కూర్చుండును)**

**విటు:** నవమాలికా! నా నవమాలికా! నీవు గూడ యీతని ప్రక్కనే కూర్చుండుము.మీ యిరువురను సమ్మానింతును.

**నవ:** **(నవ్వి, కూర్చుండును)**

**విట:** ఓరీ!చేటా! ఈ గిన్నె నిండ మంచి కల్లును నింపి యిమ్మురా!

**చేటు:** **(నింపుట నటించును)**

**విట:** **(తలపై దండలోనుండి పూవులనుఁ దీసి కల్లుగిన్నెలో నుంచి, మోకరిల్లి, నవమాలిక కందించి)**నవమాలికా! నీవు తొలుత దీనిని రుచిఁ జూచి మిగిలిన దీతని కిమ్ము.

**నవ:** (నవ్వి) నీ కోరినయట్లే.**(కొంచెము త్రావి విటున కిచ్చును.)**

విటు: **(ఆ పాత్రను విదూషకున కిచ్చుచు)** ఆర్యా! ఆత్రేయా! ఇది నవమాలిక నోటఁ బెట్టుకొనుటచేత మిగుల సువాసితమైన రసవంతమైన మైరేయము. శేఖరకుడుదప్ప మరొక్క డెవ్వడు నింతవరకు రుచి జూడనిది. ఇంతకంటె నేను నీకేమి సమ్మానముఁ జేయగలను? ఇదిగో త్రావుము.

విదూ: **(జంకుతో నవ్వుచు)** శేఖరకా! నేను బ్రాహ్మణుడను గదా! నీవెరుగవా?

విట: బ్రాహ్మణుడవైన, నీ జన్నిదమేది?

విదూ: అది యిప్పుడే యీ చేటుడు లాగినప్పుడు తెగిపోయినది గదా!

నవ: **(నవ్వి)**అట్లయిన,మరి,కొన్ని వేదవాక్యములైనఁ జదువుము.

విదూ: అమ్మా! ఆ వేదవాక్యములీ కల్లు కంపునకు మరుగునఁ బడి పోయినవి. ఐనను, నాకు మీతో వాద మేల? బ్రాహ్మణుడను నీ పాదములపై బడుచున్నాను. **(పడఁ బోవును)**

నవ: **(చేతులడ్డము బెట్టి వారించి)** అయ్యా! వలదు వలదు. నీవిట్లు జేయరాదు. శేఖరకా! తొలగి నిలువుము. ఈయన బ్రాహ్మణుడు గదా! అయ్యా! ఆత్రేయా! ఏదో వియ్యపువాడవని మేల మాడితిమి. కోపపడకుము. మన్నింపుము.

విటు: ఆగుము నేను గూడ క్షమాపణము జెప్పెదను. అయ్యా! బ్రాహ్మణా! మత్తులో నేనేదో పొరబడి యిట్లు జేసితిని.

మన్నింపుము. నమస్కారము. ఇక నేనును, నానవ మాలికయు కల్లంగడికిఁ బోయెదము.

**విదూ:** నా కేమియుఁ గోపము లేదు. సైరించితిని, పొండు, నేనును నా మిత్రుని యొద్దకుఁ బోయెదను.

**(నవమాలిక, విటుడు , చేటుడును నిష్క్రమింతురు.)**

**విదూ:** అభాగ్యబ్రాహ్మణున కకాలమృత్యువు త్రుటిలోఁ దప్పినది రా నాయనా! తాగుబోతులు దాకి మైలపడితిని గనుక యీ దిగుడుబావిలో స్నానము జేయుదును.**(స్నానము నటించి**,తెరలోనికిఁ జూచి) అదే నా ప్రియమిత్రుడు గూడ రుక్మిణితో నున్న శ్రీకృష్ణునివలె మలయవతితో గలిసి యిటే వచ్చు చున్నాడు. పోయి యాతనితో నుండెదను.

**(అంతట వరనైపథ్యముతో నున్న జీమూతవాహనుడు మలయవతితోఁ గలిసి సపరివారముగఁ బ్రవేశించును.)**

**జీమూతవా:** (మలయవతిని జూచుచు, దనలో )

**చూడదు; నేలచూపులిడుఁ జూచినఁ; బల్కదు పల్కరించినన్;**
**తోడిచెలుల్ దొలంగి చనఁ దోడనఁ దానుఁ దొలంగఁ జూచు; మో**
**మోడి పరుండు సెజ్జ నటుమోమయి; కౌగిటఁ గూర్ప భీతయౌ;**
**చేడె నవోఢ, యీ విముఖచేష్టలఁ బ్రీతియె కూర్చు నాకిటన్. 39**

(ప్రకాశముగా) ప్రియా, మలయవతీ!

**మౌనంబూనితి నెవ్వరేమనిన, మార్మాటాడకూకొట్టుచున్,**
**గ్లానిన్ సైచి శరీరమెల్లఁ దవతుల్యజ్యోత్స్నలన్ మాడ్చితిన్,**
**నానాటన్ మదిఁ జిక్కఁబట్టుకొని నిన్ ధ్యానించితిన్, రేబవల్,**
**నేనీనాటికిఁ దత్తపః ఫలముగా నీ మోముఁ గంటిన్ సఖీ! 40**

**మలయ:** **(అపవారించి)** చతురికా! వింటివా? ఈతని రూపమే కాదు, ప్రియవాక్యము గూడ మనోహరమే.

**చతు:** **(నవ్వి, అపవారితముగా)** విద్ధారముగా బలికెదవే! ఇందు సత్యము గాక ప్రియవాక్య మేమున్నది?

**జీమూతవా:** చతురికా! కుసుమాకరోద్యానమునకు దారిఁ జూపుము.

**చతు:** దేవా! ఇటు రండు, ఇటు!.

**జీమూతవా:** **(పరిక్రమించి, మలయవతిని బరిశీలించి)**

**అలయికఁ గూర్చు నీ స్తనమహాభరమే, యిక నేల హారముల్?**
**కలగు నితంబభారమునఁ గ్రాగి తొడల్, మొలనూలికేటికిన్?**
**కలికి! ఘనోరుభారమున గాసిలు నంఘ్రులకేల నూపురాల్?**
**పొలుపు నిజాంగకమ్ము లిడు, భూషలు నీకు శ్రమైకలాభముల్.** 41

**చతు:** స్వామీ! ఇదే యుద్యానము. ప్రవేశింపుడు.

**(అందరు ప్రవేశింతురు.)**

**జీమూతవా:** **(చుట్టును జూచి)** ఆహా! కుసుమాకరవనము శోభ!

**తరుభవచందనస్రుతి, లతాగృహకుట్టిమభూమి శైత్యముల్**
**దరచగు; వారిగేహజలధారల మ్రోతల నాడుఁ గేకులున్;**
**మొరసెడు వారియంత్రముఖముక్తజలౌఘము, పాతవేగని**
**ర్భరహృతపుష్పధూళిఁ గడుఁబచ్చగఁ బాదులు నిండఁబారుచున్.**42

ఎటు జూచినను,

**నిజఝూంకారములన్, లతాగృహములెంతే మారుమ్రోయన్, బ్రసూ**
**నజధూళుల్ బటవాసశోభల మెయిన్ గల్గింప, భృంగాంగనా**
**వ్రజమున్ గూడి మరందపానములఁ బర్యాప్తంబుగాఁ జేయుచున్,**
**బ్రజకున్ మోదముగూర్చు భృంగతతి యాపానోత్సవాసక్తమై.** 43

**విదూ:** **(సమీపించి)** వయస్యా! జయము. అమ్మా! స్వస్తి.

**జీమూతవా:** మిత్రమా! చాలసేపటికిఁ గనబడితివి!

**విదూ:** నేను తొందరగనే వచ్చితిని. కాని యీ పరిణయ మహోత్సవమున సిద్ధవిద్యాధరులు గలిసి జేసికొను చున్న పానగోష్ఠులనుఁ జూచు కుతూహలముచేత నటనటఁ దిరిగి చూచుచు వచ్చుటచేత (తనలో) నీ వియ్యంకుల తొత్తు ముండయు, దాని విటుడును నాకు వింత వింత సమ్మానముఁ జేయుటచేత ( ప్రకాశముగా) నింత విలంబమైనది. అదిగో! నీవునుఁ జూడుము, పానగోష్ఠు లెంత కోలాహలముగా జరుగుచున్నవో!

**జీమూతవా:** **(అంతటఁ జూచి)** నిజమే వయస్యా! ఏ ప్రక్కన నైనఁ జూడుము!

**నాకానోకహపుష్పమాలల, మెయిన్ గంధానులేపమ్ములన్,**
**నైకాలంకృతిరత్నరుజ్మిళననానాచిత్రితాచ్ఛాంశుక**
**శ్రీకుల్, గంధపుజెట్లనీడలఁ, బ్రియస్త్రీపీతశిష్టాసవ**
**స్వీకారోత్సవమగ్నులై రిచటహో ! విద్యాధరుల్ సిద్ధులున్.** 44

కనుక మనముగూడ యీ తమాలవృక్షవాటికకుఁ బోవుదము పద. **(పరిక్రమించును)**

**విదూ:** ఇదే తమాలవాటిక. ఇంత దూరము నడచి నడచి నీ దేవేరి డస్సి నట్లున్నది. ఇదిగో యీ స్ఫటికమణి తలమునఁ గూర్చుండి విశ్రమింతము .

**జీమూతవా:** మిత్రమా! చక్కగాఁ గనుగొంటివి.

**మున్నె గెలిచి శశాంకుఁ గపోలకాంతి,**

**రమణి మోమిప్డు తాపానురక్త మగుచుఁ**
**గెరలి కెందామరలఁ గూడఁ గెలువఁ జూచుఁ,**
**దీన రేబవల్ దనకె యాధిక్య మొదవ.** 45

**(మలయవతి చేతిని బట్టుకొని)** ప్రియా! రమ్మిందు విశ్రమింతము.

**మలయ:** ఆర్య పుత్రుల యానతి.

**(అందరుఁ గూర్చుందురు.)**

**జీమూతవా:** **(మలయవతి ముఖమును పైకెత్తి, చూచుచు)** ప్రియా! ఈ కుసుమాకరోద్యానవనమునుఁ జూడఁ గుతూహలపడి నిన్ను వ్యర్థముగా శ్రమపెట్టినట్లున్నాము. ఎందుకనిన,

**పాటలాధరపల్లవభాసితమ్ము,**
**భ్రూలతాచారుపైన నీ ముఖమె నిజము**
**నందనోద్యానవనమగుస్, దక్కుఁ గల్గు**
**వనము లేపైనఁ గేవలవనము లగును.** 46

**చతు:** **(చిరునవ్వుతో విదూషకునితో)** వింటివా మా రాజ కుమారిని మీ యువరాజు గారెట్లు వర్ణించుచున్నారో?

**విదూ:** చతురికా! అంతగా మిడిసిపడకుము. మనలో మాత్రము కంటికింపైన రూపమున్న వారు లేరా యేమి! ఉండనే యున్నారు. కాకపోయిన, యీసుకొలది,వారి నెవరును వర్ణింపరంతే.

**చతు:** సరే పోనిమ్ము, అట మా రాకుమారి తన భర్తచే వర్ణితురాలగుచుండగా,నిన్ను నేనిట వర్ణితునిఁ జేయనా!

**విదూ:** **(సంతోషముతో ఉబ్బిపోవుచు)**ఇకనేమి! బ్రదికిపోయితిని!

నీ యమ్మకడుపు చల్లగా నన్నట్లు కొంచెము దయజూచి పుణ్యానఁ బోయితివా, ఎవడును నన్నింక పండుకోతి యని,యది యని,యిది యని,యనకుండును! కానిమ్ము.

**చతు:** అయ్యా! నిన్న పెండ్లిలో నిద్రకాగలేక నీవు మూతకళ్ళతో జోగుచుండగాఁ జూచితిని. ఆ రీతినే నీ యంద మతిశయించును గాన, నీ విపుడుగూడ యట్లే కన్నులు మూసికొని యుండుము. క్షణములో నిన్ను వర్ణితునిఁ గావింతును.

**(విదూషకుడు కన్నులుమూసికొని యుండును)**

**చతు:** **(తనలో)** ఈతడు కనులు దెరచులోపల నీలరసము వంటి యీ కానుగుజిగుళ్ళ రసము నీతని ముఖమునిండఁ బూసెదను. **(లేచి, చిగురులు పిండి రసము విదూషకుని మొగమునఁ బులుమును.**

**( మలయవతీజీమూతవాహనులు జూచుచుందురు.)**

**జీమూతవా:** వయస్యా!అదృష్టవంతుడవు సుమా! మేమిందర మిక్కడ యుండగా, నీవొక్కడవే యిట్లు వర్ణితుడవగుచున్నావు గదా!

**(మలయవతి చిరునవ్వుతో విదూషకుని వైపు జూచి, జీమూతవాహనునిఁ జూచుచుండును)**

**జీమూతవా:** **(మలయవతి ముఖమునుఁ జూచుచు)**

**పెదవిజిగురునఁ జిరునవ్వు విరి జనించె**
**నీకుఁ, గాని యద్దానఁ బండెడు ఫలమ్ము**

**మాత్ర మన్యత్ర యగు ముగ్ధనేత్ర! నిన్ను**
**రెప్ప వాల్చక చూచు నా దృష్టులందె! 47**

**విదూ:** **(కనులు దెరచి)** చతురికా! ఏమి చేసితివి?

**చతు:** నిన్ను వర్ణితునిఁ జేసితి నయ్యా!

**విదూ:** **(కోపముతోఁ గర్రనుఁ బైకెత్తి)** ఓసి తొత్తుకూతురా! ఎంత పనిఁ జేసితివే! రాజగృహములో గదా! నిన్నిప్పుడేమి జేయగలను! బ్రదికిపోయితివి. **(జీమూతవాహనునితో)** వయస్యా! మీరిరువురి యెదుటనేనా యీ తొత్తుముండ కూతురిచేత నాకింత ఎగతాళి? ఇంక నేనిక్కడ యుండుట యెందులకు? ఎట్లైనఁ బోయెదను. **(వేగముగా నిష్క్రమించును)**

**చతు:** మాన్య డాత్రేయుడు నాపై నలిగినట్లున్నాడు. పోయి బతిమాలుకొందును. **(పోఁబోవును)**

**మలయ:** **(చేతఁ బట్టి నిలిపి)** ఏమే, న న్నొక్కదానినిఁ జేసి పోయెదవా?

**చతు:** **(జీమూతవాహనునిఁ జూపించి, మలయవతితో చిరునవ్వుతో)** ఎల్లప్పుడు నిట్లొక్కదానవే యుండుము! **(నిష్క్రమించును.)**

**జీమూతవా:** **(మలయవతి ముఖముఁ జూచుచు)** ప్రియా!

**అరుణకరావళుల్ దగిలి నంతనఁ బాటలకాంతిఁ గాంచె; ను**
**త్సరదురుదంతకాంతుల లసన్నవకేసరశోభఁ దాల్చె; నీ**
**సరణి, సధర్మతస్ జలజసామ్యముఁ గాంచిన నీ మొగమ్మునం**
**దరయ,నభావ్యమయ్యె మధువానుచుఁ జొక్కెడు తేటి యొక్కటే!48**

**మలయ:** **(నవ్వి, మొగముఁ ద్రిప్పుకొనును.)**

**జీమూతవా:** **(మరల , అరుణకరావళుల్... ఇత్యాదిఁ బఠించును)**

**చతు:** **(పటాక్షేపముతోఁ బ్రవేశించి, సమీపించి)** జయము. ఏదో పనిమీద యువరాజునుఁ జూడఁగోరి యార్యమిత్రావసువిదే వచ్చి యున్నాడు.

**మలయ:** ప్రియా! నీవు నీ భవనమున కేగుము. మిత్రావసువుతో మాటలాడి నేనును వెంటనే వచ్చెదను.

**(మలయవతి నిష్క్రమించును. మిత్రావసువు బ్రవేశించును.)**

**మిత్రా:**

**తెంపున నప్పుడ చంపక**
**నొంపక, జీమూతవాహనుని దాయాదున్;**
**పెంపరి చెప్పవలసెఁ దల**
**వంపుగ 'నీ రాజ్య మరులు బట్టి' రటంచున్. 49**

అట్లని, చెప్పకతీరని దగుటచే చెప్పి పోవలసినదే!

**(సమీపించి)** యువరాజా! నమస్కారము.

**జీమూతవా:** **(చూచి)**మిత్రమా!మిత్రావసూ!ఇటు వచ్చి కూర్చుండుము **(మిత్రావసువు కూర్చుండును.)** ఏమి మిత్రావసూ! ఏదో కోపముగా నున్నట్లున్నావు?

**మిత్రా:** నీచమతంగుని విషయమున కోపము గూడనా!

**జీమూతవా:** ఏమి? మతంగుడేమి చేసెను?

**మిత్రా:** ఏమి చేసెనా! చేటు మూడి, నీ రాజ్యము నపహరించెను.

**జీమూతవా:** **(సంతోషముతో, తనలో)** ఇది నిజమే యై యుండునా!

**మిత్రా:** కనుక వానిని దండించుటకు యువరాజు లానతీయ వలయును. ఒక్కటే మాట!

**ప్రచురవిమానపంక్తుల నభస్స్థలి గ్రిక్కిరియంగ, వార్షుకా**
**భ్రచయము లట్లు మూగి, రవిఁ గప్పి దివాతిమిరంబుఁ గల్గఁ జే**
**యుచుఁ జనుటేమి సిద్ధులు ద్వదుక్తిమెయిన్, నినుఁ జేరు టేమి నీ**
**స్వచరితరాజ్య, మాజివధశంకిభయానతరాజకంబుగన్** 50

లేదా, మతంగుని పాటివానికీ మా సైన్యములు మాత్ర మేల?

**చటులమదేభఘాతిహరి చాడ్పున, సేనని నిల్చినన్, సము**
**త్కటరభసావకర్షణచకచ్చకదుజ్జ్వలఖడ్గరుఙ్మహా**
**పటలవిసారకేసరవిభాసివిరోధిదురీక్ష్యమూర్తినై,**
**కుటిలకుడా మతంగహతకుండు హతుండని యే యెరుంగుమీ!** 51

**జీమూతవా:** **(చెవులుమూసికొని, తనలో)** ఘోరము! అబ్బా! ఎంత దారుణమైన మాటలు! సరే ఇట్లు చెప్పి చూచెదను. **( ప్రకాశముగా)** మిత్రావసూ! ఇంతకంటె బెక్కు మడుంగులగు దానినైన సాధింపగల నీవంటి పరాక్రమ శాలి కిది యొక లెక్కయా? కాని,

**ఆత్మదేహంబు నైన నప్రార్థితముగఁ,**
**బరహితార్థమై యొసగు నావంటివాడు**
**తుచ్ఛరాజ్యార్థమై యెట్లు దుష్ట, మఘుద,**
**మైన ప్రాణివధక్రౌర్య మనుమతించు?** 52

అదియునుఁగాక, మోహకరములైన మనఃక్లేశములపట్లఁ దప్ప నా కితరత్ర శత్రుబుద్ధియే లేదు. కావున రాజ్యాశతో క్లేశవశుడైన దీనుడు మతంగునిపట్ల దయఁ జూపుము.

**మిత్రా:** **(సామర్షముగా)** అవును! మనకింత యుపకారము

జేసిన దీనుడు, వాడు, దయఁజూపఁ దగినవాడే మరి!

**జీమూతవా:** **(తనలో)** ఉద్ధతుడును, మహావేశపరుడును, వర్ధమాన కోపోద్రిక్తుడునగు యీతనిని మరల్ప యిప్పుడు శక్యము గాదు. కనుక ఇది మార్గము.**( ప్రకాశముగా)** మిత్రావసూ! లెమ్ము. ఇంటికిఁ బోయి మాటలాడు కొందము. సాయంకాలమైనది చూడుము!

**త్వరతో, నిత్యముఁ, బద్మకోశముల నిద్రాముద్రలన్ బాపుచున్;**
**గరదీప్తిన్ నిఖిలాశలన్ నినిచి, లోకశ్రేణులన్ దన్పుచున్;**
**బరలాభైకధృతప్రయాసుడగు నీ భానుండె శ్లాఘ్యుం, డిదే**
**చరమావస్థను, సిద్ధసంస్తుతివచోఽర్చాపాత్రమై యొప్పెడున్.** 53

పద పోవుదము.

**(అందరు నిష్క్రమింతురు.)**

**ఇది శ్రీహర్షుని నాగానందనాటకమునకు**

**మార్కండేయప్రసాద్ చేసిన ఆంధ్రానువాదమునందు**

**తృతీయాంకము.**

**-*-**

# నాగానందము

## చతుర్థాంకము

### విష్కంభము

(అంతట నొకప్రక్క యెఱ్ఱని వస్త్రములను చేతఁ బట్టుకొని
కంచుకియు, మఱొక ప్రక్కనఁ బ్రతీహారియుఁ బ్రవేశింతురు.)

**కంచుకి:** ప్రతిపదప్రమాదకృతరక్ష, నంత:పు
రాహితవ్యవస్థ నరసికొనుచు,
దండనీతి నూని ధరణీశవృత్తి నే
పూని నట్లయుంటి ముదిమిఁ జివికి . 54

**ప్రతీహారి:** ఆర్యా! వసుభద్రా! ఎక్కడకో బయలుదేరినట్లున్నావు!

**కంచుకి:** మన రాజుగారి యింటి కట్టుబాటు ప్రకారము, కుమార్తె పెండ్లి యైన పిదప పదినాళ్ళపాటు క్రొత్త దంపతుల కిరువురకు ప్రతిదినము నెఱ్ఱ వస్త్రములను బంపించ వలయును గదా! నిత్యము వానినిఁ దీసికొనిపోయి యిచ్చు పనిని నాకప్పగించినారు. వారికి నేడా వస్త్రములనుఁ దీసికొనిపోవుచున్నాను. కాని, మన రాకుమారి మలయవతి యేమో తమ యత్తవారింట నున్నది. అల్లుడుగారేమో బావమఱది మిత్రావసువుతోఁ గలిసి సముద్రతీరవిహారమున కరిగిరని వింటిని.ఇప్పుడు నేను రాకుమారి కడకుఁ బోవుదునా,లేదా యల్లుడు గారున్న కడకా, యని తేల్చుకొన లేకున్నాను.

**ప్రతీహారి:** ఆర్యా! రాకుమారి యున్న కడకుఁ బోవుటయే మేలు. ఈ

పాటికి విహారము ముగించుకొని యల్లుడుగారు గూడ తా మక్కడకే పోయి యుందురు.

**కంచుకి:** అవును. సరిగాఁ జెప్పితివి. సరే,సునందా! నీవెక్కడకు?

**ప్రతీహారీ:** విశ్వావసుమహారాజు గారు నాకు ' యువరాజు మిత్రావసువులవారి యొద్దకు బోయి, యీ దీపోత్సవ సందర్భమున మలయవతికిని గ్రొత్త యల్లుడైన జీమూత వాహనునకును నేదైన బహుమాన మీవలసియున్నది గనుక నీవు వెంటనే వచ్చి తదనురూపమైన యేర్పాట్లఁ జేయు' మని చెప్పి రమ్మని యానతిచ్చినారు. నే నందులకై యువరాజులవారిని బిలుచుకొని వచ్చుటకై యాయన యొద్దకు బోవుచున్నాను.మరి నీవు రాకుమారి యున్న యెడకేగుము, నేనును నా పని మీదఁ బోయెదను.

**కంచుకి:** మంచిది.

**(ఇరువురు నిష్క్రమింతురు.)**

## ఇది విష్కంభము

**(అంతట మిత్రావసువుతోఁ గలసి జీమూతవాహనుడు బ్రవేశించును.)**

**జీమూతవా:** మిత్రావసూ! పురవాసముకంటె వననివాసము కొన్నిట మెరుగే.

**తరుగృహ, మశ్మపీఠము, సదామృదుశాద్వలతల్ప, మచ్ఛని**
**ర్ఝరజలపాన, మైణసఖిజాతముఁ, గందఫలాశనమ్ము నై**
**వరలు వనానఁ గోరకయ వచ్చు సమస్తము; లోపమొక్కటే;**
**పరహిత క్లి ప్తిఁ గానకిటు వ్యర్థత నుండుటె , యర్థిహీనతస్. 55**

**మిత్రా:** **(ప్రొద్దుఁ జూచి)** యువరాజా! ఇక త్వరగాఁ బోవుదము. ఇది సముద్రమునకుఁ బోటు వచ్చు వేళ.

**జీమూతవా:** **(సముద్రమునుఁ బరిశీలించి, చెవి యొగ్గి)** అవునవును. బాగుగా గురితించితివి.

**నానాపర్వతకందరోదరములన్ మార్మ్రోయగాఁ జేయుచున్,**
**వీనుల్ వ్రీలఁ జెలంగుచున్నవి నదన్నీరేభవిక్షిప్తపా**
**థోనిధ్యుద్ధతభంగజధ్వను; లిదే తోతెంచె వేలాక్షణం,**
**బానీతోద్యదసంఖ్యశంఖతతులల్లాడంగఁదీరమ్ముననన్.** 56

**మిత్రా:** అదిగో! పోటు రానే వచ్చినది.

**తనరు నీ వార్ధివేల, ముక్తాప్రవాళ**
**రుచిరరుచిరంజితము, ధ్వనిప్రచురమగుచు,**
**గబళితలవంగపల్లవగ్రాహకుంభి**
**ముఖకృతోద్గారసురభితాంబువులుగలిగి.** 57

కనుక యిప్పుడు మనమీ నీటితాకు దగులు దారినఁ గాక తొలగి, కొండ చరియల ప్రక్కనఁ గల దారినఁ బోవుదము. **(ఇరువురునుఁ బరిక్రమింతురు.)**

**జీమూతవా:** మిత్రావసూ! ఇటు జూడుము శరత్కాలమందువలె తెల్లనైన మబ్బులు గ్రమ్ముట చేత నీ మలయగిరి సానువులు గూడ  తుహినగిరిసానువులవలె నెట్లు భాసిల్లుచున్నవో!

**మిత్రా:** కాదు. అవి మలయగిరిసానువులు గావు. నాగుల ఎముకల గుట్టలు.

**జీమూతవా:** **(జాలితో)** అయ్యయ్యో ! పాపము! అంతటి సంఘాత మరణముల కేమి కారణమో!

**మిత్రా:** యువరాజా! అవి సంఘాతమరణములు గావు. దీని కథ వినుము. పూర్వమొకప్పుడు గరుత్మంతుడు తన రెక్కల గాలిచే సముద్రపు నీటి నెగురఁ జిమ్మి, రసాతలము నందలి నాగులను బట్టుకొని భక్షించుచుండెడివాడట.

**జీమూతవా:** అబ్బా! ఎంత ఘోరపు పని! అప్పుడు?

**మిత్రా:** నాగజాతినాశమునకు వెరచి నాగరాజైన వాసుకి గరుత్మంతుని కిట్లు జెప్పెనట.

**జీమూతవా:** **(ఆదరముతో)** ఏమని! ముందు తననుఁ దినుమనియా?

**మిత్రా:** కాదు, కాదు.

**జీమూతవా:** కాదా?మరి ఇంకేమని ?

**మిత్రా:** ఇట్లని. 'నీ ధాటికి బెంబేలుపడుచున్న నాగయువతులకు వేనవేలుగా గర్భపాతములగుచున్నవి.పెక్కండ్రు బాలురు గూడ భయముచే గతాసులగుచున్నారు. అట్లు సంతతి విచ్ఛేదముచే మా జాతి క్షయమగుటవలన నీ స్వార్థమే భగ్న మగును. కనుక నాగులను భక్షింపఁ గోరి మా లోకమునకు వచ్చు నీకు నాహారముగా దినమునకొక్క నాగునిఁ బంపెదను.' అని.

**జీమూతవా:** ఎంత మహానుభావుడో,పాపము! అక్కటా!ఇక నాగులను వారి రాజు బాగుగానే కాపాడినట్లు !

**'ఒక్క నాగునిఁ గావ నా యొడలు నేటి**
**కప్పగింతును నాగాశి' కన్న మాటఁ**

**బలుకఁ జాలక పోయెనే, వాని తలల**

**నున్న నిరువేయి నాల్కలం దొకటి యైన! 58**

**మిత్రా:** ఆ కట్టడికి పక్షిరాజొప్పుకొనియెను. దానఁ జేసి,

**అమ్మెయి** నాగరాజు **నియమానుగతిస్ బతగాధినాథభో**

**జ్యమ్ముగఁ బంపుచుండ, భుజగాళి వధించి భుజించినట్టి నా**

**గమ్ముల యెంప ప్రోవులివి, కాలము తోడుత వృద్ధిఁ బొందెఁ, బొం**

**దుమ్మరి,పొందుచున్నవియ,తుంగహిమాచలశృంగతుల్యముల్.59**

**జీమూతవా:** ఆహా! ఎంత విచిత్రము! ఎంత యాశ్చర్యము!

**ఎల్ల రోతల నిలయంబు, నింత యేని**

**కృత మెరుంగనిదియు, బహుక్లేశకరము**

**మిగుల నశ్వరమైన యీ మేని కొరకుఁ**

**గూడ పాపముల్ గావింత్రు మూఢు లకట! 60**

అయ్యో! పాపమీ నాగుల యాపద కంతమెన్నడో కదా!

**(తనలో)** నాశరీరమర్పించి యొక్క నాగుని ప్రాణముల

నైనను గాపాడుటకు నా కవకాశము గలుగునా!

**(ప్రతీహారి ప్రవేశించును)**

**ప్రతీ:** అమ్మయ్య! కొండ నిప్పటి కెక్కఁగలిగితిని! ఇందు

మిత్రావసు వెక్కడున్నాడో చూచెదను.**(పరిక్రమించి)** ఇదే

మిత్రావసువు తన బావగారితోఁ గలిసి యిక్కడ

నున్నాడు. **(సమీపించి)** కుమారులకు జయము.

**మిత్రా:** **(చూచి)** సునందా! నీవా! వచ్చిన పని?

**ప్రతీ:** **(చెవిలోఁ జెప్పును)**

**మిత్రా:** యువరాజా!మా తండ్రిగారు నన్నుఁ జూడఁగోరుచున్నారు.

**జీమూతవా:** మంచిది, నీవు పొమ్ము. నేను వెనుక వచ్చెదను.

**మిత్రా:** యువరాజా! మీరైనను, అనేకాపాయములకు వీలిచ్చు నిచ్చోట పెద్ద తడవు నిలుచుట మంచిది కాదు.

**(ప్రతీహారితో గలసి నిష్క్రమించును)**

**జీమూతవా:** నేను గూడ యీ కొండ దిగి సముద్రతీరసౌందర్యమునుఁ జూచెదను. **(పరిక్రమించును)**

**(తెరలో)**

హా హా పుత్రకా, శంఖచూడా! నేటికి నా పాడు కన్నుల ముందరనే నీ చావునుఁ జూడవలసివచ్చెను గదా, నాయనా!

**జీమూతవా:** ఆఁ, ఏమిది? స్త్రీ విలాపమువలె నున్నదే! ఆమె భయమున కేమి కారణమో పరిశీలింతును.

**(పరిక్రమించును)**

**(అంతట ఏడుచుచున్న తన వృద్ధమాత వెంటరాగా శంఖచూడుడును, మూసి చుట్టిన వస్త్రయుగళముతో నాగకింకరుడునుఁ బ్రవేశింతురు.)**

**మాత:** **(కన్నీటితో)** అయ్యో!నా కొడుకా!నీ చావునుఁ గన్నులతోఁ జూచుటకేనా నేనిప్పటివరకు బ్రదికి యున్నది! ఇక నీ ముఖచంద్రబింబము లేక యీ పాతాళమే యంధకారమయమై పోవును గదా! **(ఏడ్చును)**

**శంఖ:** అమ్మా! నీ దుఃఖముతో నన్ను మరింత కుంగఁదీయకుము.

**మాత:** **(కొడుకునుఁ గౌగిలించుకొని, తడవుచు)** వత్సా! దయలేని యీ గరుడుడు, కేవల మెండ పేడియైన నోకని నీ

మృదుశరీరమునుఁ దినుట కెట్లు సిద్ధపడియెనో గదా!

**శంఖ:** అమ్మా! దుఃఖింపకుము. నీవెరుగవా!

**పుట్టినప్పుడ జీవులస్ బొదివి పట్టి**
**దాది వలె మృత్యువే యొడిఁ దాల్చు మొదట,**
**పిమ్మటనె కాదె చేరుట యమ్మ యొడికి?**
**నింత మాత్రాన కీ వగ పేల నమ్మ?** 61

**(పోఁబోవును)**

**మాత:** నాయనా! ఇంక కొలది సేపు నీ మొగముఁ జూడనిమ్ము నాయనా!

**కింక:** కుమారా, శంఖచూడా! ఈమె మాటలకేమి! పుత్రప్రేమ వివశ యైన యీమె పాపము, రాజకార్యముఁ దెలియఁ జాలదు . మనము బోవుదము, రమ్ము.

**శంఖ:** ఇదే వచ్చితిని.

**(అందరు బరిక్రమింతురు)**

**కింక:** **(ఎదుటఁ జూచి,తనలో)**ఈతనిని వధ్యశిలాసమీపమునకుఁ దీసికొని వచ్చితిని. కనుక యిక వధ్యచిహ్న మితని కీ వచ్చును.

**జీమూతవా:** ఈమెయే విలపించిన యా స్త్రీ. **(శంఖచూడునిఁ జూచి)** ఇతడీమె కొడుకై యుండవలెను. సరే,మరి యేల యేడ్చుచున్నది? **(చుట్టును జూచి)** ఈమె కంత భయమునకుఁ గారణ మేదియును నగపడుట లేదే! కానిమ్ము, వీరేదో మాటలాడుకొనుచున్నారు గదా, దాని ద్వారా యేమైనది తెలియవచ్చును.ఈ చెట్టు చాటున

నుండి వినుచుండును. **(చెట్టు చాటున నిలుచును.)**

**కింక:** **(క్రిమోడ్చి, కన్నీటితో)** నాయనా! శంఖచూడకుమారా! నిష్ఠురమే యైనను, రాజాజ్ఞ గావున నీతోఁ జెప్పవలసి వచ్చినది.

**శంఖ:** చెప్పుము.

**కింక:** నాగరాజు వాసుకి యాన యిది.

**శంఖ:** **(నుదుట దోయిలించి, యాదరముతో )** ఏమని రాజాజ్ఞ?

**కింక:** 'ఈ రక్తాంశుకయుగళము ధరించి వధ్యశిలపై నుండుము. ఆ యానవాలుతో గరుడుడు నిన్ను గురితించి కొంపోయి భక్షించును.' అని.

**జీమూతవా:** **(విని)** ఏమీ! ఇతడు గరుడునికాహారముగా నాగరాజు బంపిన నాగుడా!

**కింక:** కుమారా! ఇదిగో వస్త్రయుగళము. **(అందించును)**

**శంఖ:** **(గౌరవముతో)** ఇటిమ్ము. **(అందుకొని)** స్వామి యానతి నౌదలఁ దాల్చితిని.

**మాత:** **(కొడుకు చేతిలోని వస్త్రములనుఁ జూచి, గుండె బాదు కొనుచు)** హా, పుత్రా! ఇది నా పాలిటఁ బిడుగుపాటుకంటె బెడిదము గదరా నాయనా! **(మూర్ఛిల్లును)**

**కింక:** అయ్యో! గరుడుడు వచ్చు వేళ యైనది. నేను సత్వర మేగెదను. **(నిష్క్రమించును)**

**శంఖ:** అమ్మా! ఊరడిల్లుము.

**మాత:** **(తేరుకొని, కన్నీటితో)** బిడ్డా! నా కోరికలపంటా! నిన్ను మరల నేనెక్కడ జూతునురా కొడుకా! **(కౌగిలించుకొని**

**యేడ్చును)**

**జీమూతవా:** అబ్బా! గరుత్మంతుడెంత నిర్దయుడు!

**తనయస్నేహవిమూఢయై పనవుచున్, ధారాశ్రుపాతమ్ముగన్;**
**'తనయున్ గావగ నెవ్వ' రంచు దెసలంతన్ దీనయై చూచు నీ**
**జననిం జేరి, తదంకసంస్థితు శిశున్ , జంపన్ దినన్ జూచు నా**
**వినతానందను ముక్కు గాదు హృదయంబే వజ్రసారంబగున్. 62**

**శంఖ:** **(తల్లి కన్నీటిని౯ దుడుచుచు)** అమ్మా! ఇంత దుఃఖమేల! నిబ్బరించుకొనుము.

**అడిగినవారిమాటలు నిరర్థము సేయని జాలిగుండెవా,**
**రడచి నిజార్థచింతల౯, బరార్థము౯ గూర్చు దయాంతరంగులున్,**
**గడగి పరార్తిఖిన్నమతి౯ గావగ బూనెడి సజ్జనోత్తముల్,**
**గడచియ పోయి; రెవ్వరిట౯ గాచెద? రేడ్చు వృథా; సహింపుమీ! 63**

**మాత:** **(కన్నీటితో)**ఎట్లు సహించుకొందును నాయనా! ఒక్కగా నొక్క కొడుకని నాగరాజేమైన నిన్ను వంతు మానిపి వదలి పుచ్చెనా! ఓ దయమాలిన ధర్మరాజా! ఇంత ప్రాణి కోటిలో నీకు నా కొడుకొకడే కన౯బడియెనా! అన్ని విధముల నాశన మైతిని. మందభాగ్యరాల నిక జీవచ్ఛవమనే కదా!

**జీమూతవా:** **(జాలితో)**

**తన ప్రాణము మీదకు వ**
**చ్చిన యెడరున బంధుజనులచే వీడ్వడి, చా**
**వున కగ్గమైన యార్తున్**
**గని వీనిన్ గావనేని, నా తనువేలా! 64**

పోయి ప్రయత్నించెదను. **(సమీపించును)**

**శంఖ:** అమ్మా! నిగ్రహించుకొనుము.

**మాత:** అయ్యో పుత్రకా! నాగలోకరక్షకుడైన వాసుకియే నిన్ను వదలి వైచెనే, యింక నిన్నుఁ గాపాడువా రెవరు!

**జీమూతవా:** **(సత్వరముగాఁ జేరి)** నేను, నేను.

**మాత:** **(భయముతో కొడుకునుఁ గొంగుమాటునఁ గప్పి)** వైనతేయా! నన్ను భక్షింపుము. నాగరాజు నీ యాహారమున కని నన్నే పంపెను.

**జీమూతవా:** **(కన్నీటితో, జాలిగా)** ఆహా! ఈమె పుత్రవత్సలత!

**పుత్రవత్సల యీ తల్లి పొగులుబాటుఁ,**
**జెంత నిలిచి యొక్కింత వీక్షించె నేని,**
**కరుణ యెరుగని నాగాశి కఠినచిత్త**
**మందుఁ గూడఁ గరుణ బుట్టు ననుచుఁ దలతు.65**

**శంఖ:** అమ్మా! జడియకుము.ఈయన గరుడుడు గాడు.చూడు.

**విపులఫణీంద్రమస్తకవిభేదసముత్పతదుష్ణరక్తరుక్**
**స్నపితమహోగ్రచంచు డహినాశనుడెక్కడ! యిందుసౌమ్యమై**
**వపువునుఁ జిత్తవృత్తియును భాసిలు నీ మహితాత్ముడెక్క? డి**
**ట్టి పురుషుఁ జూచి యా పరుషుడే యని యెంచుట భీతిమైఁగదా66**

**మాత:** నాకైనచో, నీ విపత్తునుఁ జూచి ప్రపంచమంతయు గరుడమయముగనే కనిపించుచున్నది.

**జీమూతవా:** తల్లీ! భయపడవలదు. నేనొక విద్యాధరుడను. నీ సుతునిఁ గాపాడుటకే వచ్చితిని.

**మాత:** **(సంతోషముతో)** ఏమేమీ!నాయనా! నీ తల్లి కడుపు

చల్లగా , యా మాట మరల మరలఁ జెప్పుము నాయనా!

**జీమూతవా:** అమ్మా!ఊరక మాటలతో నేమి పని?చేసియే చూపెదను.

**మాత:** **(నుదుట కేలు మోడ్చి)** వత్సా! కలకాలము సుఖముగా బ్రదుకుము .

**జీమూతవా:** మాతా!

**వధ్యచిహ్నమైన వస్త్రముల్ నాచేతి**
**కిచ్చి, తనయుతోడ నింటి కరుగు.**
**వాని నే ధరించి, నీ నందనుని గావ**
**నతని మారు గరుడి కశన మగుదు.** 67

**మాత:** **(చెవులు మూసికొని)**హరిహరీ!అమంగళము నశించును! నీవు మాత్రము నాకు శంఖచూడునివలెకొడుకువంటి వాడవు గావా? ఇంకనుఁ జెప్పవలెనన్న నంతకంటె యెక్కుడు వాడవే కాఁ దగుదువు. బంధుజను లెవ్వరును బట్టించుకొనని నా కొడుకును నీ ప్రాణము లిచ్చి కావఁ బూనినందువలన.

**శంఖ:** ఆహా! ఈ మహోదారుని చరిత్రము లోకాతీతముగా నున్నది గదా!

**శ్వపచుండట్లు శ్వమాంసమున్ దినెను విశ్వామిత్రుడే; క్రౌర్య ము**
**ట్టిపడన్ జంపెఁ గృతోపకారుడగు నాడీజంఘునిన్ గౌతముం;**
**డెపుడున్ బాముల మెక్కుఁ గశ్యపసుతుం డీ తార్క్ష్యడున్ వేనికై;**
**కృప నీ సాధుడొసంగు, నట్టి యసువుల్, గ్రీడన్ బరార్థమ్ముగా!** 68

**(జీమూతవాహను నుద్దేశించి)** మహాసత్వా! నా కొరకై నీ వాత్మప్రదానము జేయఁ బూనుటయే నీకు నాపైఁ గల

నిర్వ్యాజమైన కృపాళుత్వమును దెల్పుచున్నది. కాని యీ నిర్బంధసాహసము వలదు, నీకు దగదు.

ఎందుకనిన,

**పుట్టుదురు గిట్టుదురు నన్ను బోలు క్షుద్ర**
**జీవు, లే మేలు గూడ దే చేటు రాదు;**
**కాని, యన్యోపకృతిదీక్ష బూని యున్న**
**నిన్ను బోలిన వారు జన్మించు టరుదు. 69**

కనుక నీ దుర్వ్యవసాయమును మానుము.

**జీమూతవా:** శంఖచూడా! పరార్థసంపాదనాకాంక్షినై యున్న నాకు జిరకాలమునకు రాక రాక వచ్చిన యీ యవకాశమును వమ్ము జేయుట నీకు బాడి గాదు.ఇంక మాటాడకుము. ఆ వధ్యచిహ్న మిటిమ్ము.

**శంఖ:** అయ్యా! మహాత్మా! ఏల వృథా ప్రయాస పడియెదవు? శంఖచూడు డిట్టి యనుచితచేష్టలకు బాల్పడి శంఖ స్వచ్ఛమైన శంఖపాలవంశమునకు మచ్చ రానీయడు. నీకు నాపైన జాలి గలదేని, నా పాటున కడలుచున్న నా తల్లికి బ్రాణరక్షణము గలిగించు దారి జూడుము.

**జీమూతవా:** చూచుటకేమున్నది? చూచియే యున్నాను. కాని యది నీ చేతులలోనే యున్నది.

**శంఖ:** అదెట్లు?

**జీమూతవా:** వినుము.

**నీవు బ్రదుక నీమె బ్రదుకు,**
**నీవు గతించిన గతించు నీమెయు నీ తోన్;**

**కావున, నను గరుడున కిడి**

**నీవు బ్రదుకు, దాన బ్రదుకు నీ జనని సఖా!70**

ఇదియే యుత్తమోపాయము.కాన నా వధ్యచిహ్నమును త్వరగా నా కొసగుము. దానినిఁ గప్పుకొని వధ్యశిలపై నుందును. నీవిక నీ తల్లినిఁ దోడుకొని యీ ప్రదేశమును వీడి పొమ్ము. లేదేని, దారుణవధ్యస్థలము నింత దగ్గరగాఁ జూచుటవలన స్త్రీసహజభీతితో మది గలగి యీమె కపాయము గలుగవచ్చును. చూచితివా బహుసర్ప కంకాళసంకులమై యీ మహాశ్మశాన మెట్లున్నదో!

**అడరించుస్ దమముస్, ముఖోద్ధృతగళత్ స్వల్పామిషార్థంబు బ**
**ర్వెడు గృధ్నూద్ధతగృధ్రముల్ , గురుగరుద్విస్తారవిక్షేపణస్;**
**బెడిదంబై వినవచ్చు విస్రుతవసావిస్రాస్రకుల్యాస్థలిస్**
**బడి క్రోష్ట్ర్యానన నిష్పతచ్ఛిఖిశిఖల్ నాదించు చూంకారముల్. 71**

**శంఖు:** **(నిర్వేదముతో)** చూడకేమి?

**సర్వదాహారఫణికులస్థాన మగుచుఁ,**
**జంద్రమస్సితాస్థికపాలసహిత మగుచుఁ,**
**దథ్యము, వినాయకప్రీతి దాయి యగుచు,**
**రుద్రతనువునా రౌద్ర మీ రుద్ర భూమి 72**

**జీమూతవా:** మరి నీ తల్లినిఁ దీసికొని వేగమే పొమ్ము. ఏల యీ కాలయాపనపు మాటలు?

**శంఖు:** ఓహో ! గరుడుడు వచ్చు వేళ యైనది. **(తల్లి ముందు మోకరిల్లి నిలిచి )** అమ్మా! ఇక నీవు మరలుట మంచిది.

**పుత్రవత్సలా! నేనెన్ని పుట్టువులనుఁ,**

**బుట్టు వాడనో నాకన్ని పుట్టువులనుఁ,**
**దల్లి వీవ కాఁగదవమ్మ ధన్యచరిత!**
**నేను ధన్యుండ నగుదు నద్దాన, తల్లి! 73**

**(పాదములకు నమస్కరించును)**

**మాత:** **(కన్నీటితో, తనలో)** అయ్యో! ఇదియేనా వీని చివరి మాట? **(ప్రకాశముగా)** నాయనా! నిన్ను విడచిపోవుటకు నాకు కాళ్ళాడుటలేదు. ఏమైనను సరియే, నీ తోపాటే యుందును.

**శంఖ:** **(లేచి)** నేనీ సమీపముననే యున్న దక్షిణగోకర్ణేశ్వరునికిఁ బ్రదక్షిణము జేసి రాజాజ్ఞఁ బాటించెదను. **(తల్లితో నిష్క్రమించును)**

**జీమూతవా:** ఎంత దురదృష్టము! అనుకొన్నది నెరవేరనేలేదే! ఇంక నాకేది యుపాయము?!

**కంచుకి:** **(సత్వరముగ బ్రవేశించి)** ఇదే వస్త్రయుగళము కుమారా!

**జీమూతవా:** **(చూచి సంతోషముతో, తనలో)** ఏమీ యీ యదృష్టము! అసంకల్పితముగ లభించిన యీ యరుణవస్త్ర యుగళముతో నా సంకల్పము సిద్ధించినట్లే.

**కంచు:** కుమారా! ఈ వస్త్రయుగ్మమును తమకై మిత్రావసుమాత యగు మహారాజ్ఞి బంపినారు. తమరు ధరింపదగును.

**జీమూతవా:** **(ఆదరముతో)** ఇటు తెమ్ము.

**కంచు:** **(అందించును)**

**జీమూతవా:** **(అందుకొని, తనలో)** మలయవతితో నా పాణిగ్రహము నేడు గదా సఫలమైనది!**(ప్రకాశముగా)** ఆర్యా! బయలు

దేరుము.నా మాటగా మహారాజ్ఞికి నమస్కరింపుము.

**కంచు:** యువరాజుల యానతి. **(నిష్క్రమించును)**

**జీమూతవా:**

**అనుపైన రీతి, నే నను**
**కొనకయ,యరుణాంశుక మొనఁగూడుట నాకుస్**
**ఘనతమమోదమునిడు, నొ**
**క్కనిఁ గావస్ దనువు విడువఁగాఁ గోరు తరిస్.74**

**(చుట్టునుఁ జూచి)** మలయగిరిశిఖరతరుప్రదరవారము లల్లలనాడఁ బ్రచండవాయువులు వీచుచున్నవి.

గరుత్మంతుడు సమీపించుచున్నాడు గాబోలు! అడుగో!

**ప్రళయాబ్దప్రతిపక్షపక్షపిహితాభ్రప్రాంతుడై, స్వీయ ని**
**స్తులవేగోద్ధుతవార్ధివారి భువి ముంచుస్ నాగ మీరస్ దటిస్,**
**గలగంబారి దిశేభముల్ విలయశంకస్ జూడఁ, దార్క్ష్యుండు వ**
**చ్చె, లసద్ద్వాదశభానుతుల్యనిజరోచిఃపీతదిగ్భాగుడై. 75**

శంఖచూడుడు మరలి వచ్చులోపల సత్వరముగఁ బోయి వధ్యశిలపై నుందును. **(శిలపైఁ గూర్చుండి, స్పర్శ సుఖము నభినయించుచు)** ఆహా! ఎన్నాళ్ళకో నా కోర్కిఁ దీర్చుకొనఁ జేయుచున్న దీని స్పర్శ మెంత హాయి గా నున్నది!

**వింత సుఖమిచ్చు నీ వధ్యవేది స్పర్శ,**
**మలయచందనలేపార్ద్రలలితదేహ**
**మలయవతిగూడ దన స్పర్శవలన నాకు**
**నింత సుఖమీయఁ జాలదంచెంతు మదిని. 76**

మలయవతి మాట లెక్కేమి?

శైశవమునఁ దల్లియొడియె
నా శయ్యగఁ , జింత లేక నాకమరిన సం
వేశంబున నైననుఁ గన,
నీ శిల దనయొడిని నిప్పుడిడు నీ సుఖమున్. 77

ఇదే గరుడుడు వ్రాలుచున్నాడు.ఈ వధ్యచిహ్న
వస్త్రమునుఁ గప్పుకొందును.(కప్పుకొనును)
(అంత గరుడుడు బ్రవేశించును)

గరుడుడు: (ఉద్ధతముగా)

శశి కంపింపగ, బెగ్గిలన్ రవిహరుల్, చండాంశుడల్లాడ దు
ర్దశఁ, బ్రీతిం గన యన్న, భీతవలయత్సర్వాంగు శేషాహినిన్
విశమున్ జేయుచుఁ, బ్రాంతసక్తజలభృద్విస్తీర్ణపక్షుండ, న
హ్యశనార్థమ్ము బయోధితీరమలయాఖ్యాద్రిన్ ద్రుటిన్ జేరితిన్. 78

జీమూతవా: (ఆనందముతో)

ఉరగునిఁ గావ నా తనువు నొప్పన జేయుటచేతఁ బుణ్యమే
పొరయున యేనిఁ, దత్ఫలము, పుట్టువు పుట్టువు నందు నిట్టులే
పరులకు మేలుఁ జేయుటకుఁ బట్టగు దేహము బొందుటౌను గా,
కరయఁ, బరార్థమై చనని యంగము నంగమె, జన్మ జన్మయే! 79

గరుడుడు: (వధ్యశిలపైనున్న జీమూతవాహనుని జూచి,
అట్టహాసము జేసి )

అరుణప్రావృతుడై వధస్థలిఁ, దదన్యాశీవిషత్రాతయై
యురగుం డల్లదె యుండె, మద్భయదళత్ప్రోద్య ద్ధృదంతఃపుటో
త్సరదస్రమ్మునఁ దోగినట్లు; భిదురోద్దండాగ్రచంచుక్షతిన్
బరియల్ సేసి యురమ్ము,వీనిఁగొని యాస్వాదింతు క్షుచ్ఛాంతికై 80

(దుమికి జీమూతవాహనునిఁ బట్టుకొనును. పుష్ప వృష్టియు,
నేపథ్యమున దుందుభిధ్వనులును .)

గరుడుడు: (ఆశ్చర్యముతో)ఓహోహో! ఏమిది? ఎక్కడివీ పుష్ప వర్షము, దుందుభి ధ్వానములు! (పైకిఁ జూచి,చెవి యొగ్గి)

కురియు నభంబు బువ్వు లళికోటి సుగంధముచేతఁ దన్పుచుస్,
మొరసెడు దేవదుందుభిసమూహము దిక్కులు మారుమ్రోగగస్,

(పెద్దగా నవ్వి) అదియా సంగతి!

ఎరిగితిఁ జుమ్మి! నా సెగయు నీదర నూగెను పారిజాతమే!
ఒరలు లయాభ్రసంఘము క్షయోదితశంక జనించి యొక్కటస్ 81

జీమూతవా: (తనలో) అమ్మయ్య! భాగ్యవశమునఁ గృతార్థుడ నైతిని.

గరుడుడు: (జీమూతవాహనునిఁ బరిశీలించుచు)

ఉరగులనుఁ గావ నాకుస్
గురియగు నీతండు నాకు గురువై తోచుస్.
సరిపడు నీనాటికి నా
యురగాశనకాంక్షఁ దీర్ప నోపు ధ్రువముగస్.82

వీనినిఁ గొనిపోయి మలయగిరిశిఖరము పైన యథేష్టముగా భుజింతును.

(అందరు నిష్క్రమింతురు.)

ఇది శ్రీహర్షుని నాగానందనాటకమునకు
మార్కండేయప్రసాద్ చేసిన
ఆంధ్రానువాదమునందు
-*- చతుర్థాంకము.-*-

# నాగానందము

## పంచమాంకము

(ప్రతీహారి ప్రవేశించును)

ప్రతీ: ఇంటి పూఁదోట మసలుఁగా కిష్టజనుడు,
**వాని యెడఁ గీడె శంకించు స్వజన మెపుడు,**
**దృష్టబహ్వపాయము భయహేతువైన**
**నట్టడవి నల్లు డొకడుండఁ దట్టుకొనునె? 83**

సముద్రతీరవిహారకుతూహలియై యేగిన తమ యల్లుడు జీమూతవాహనునిగురించి యిప్పుడు మా విశ్వావసు మహారాజుగూడ యట్టి యుద్వేగమునకే లోబడినారు. కనుకనే నన్నుఁ బిలిచి, 'సునందా! జీమూతవాహను డింతవరకును తిరిగి రాలేదు. గరుడభయసంభవస్థల సమీపమున నతడొక్కడే యుండుట నాకు శంకితముగా నున్నది. కనుక నీవేగి యాత డింటికి వచ్చెనో లేదో తెలిసికొని ర' మ్మని బంపినారు. జీమూతకేతువున్న యాశ్రమమునకే పోయెదను. **(పరిక్రమించి, యెదుటఁ జూచి )** అడుగో! భార్యయుఁ గ్రొత్తకోడలును సేవింపుచుండ జీమూతకేతు వుటజాంగణమున నున్నాడు.

**నివుడన్ భంగతరంగితాంచలములన్ ఫేనాంబుతుల్యాంశుక**
**చ్ఛవి, చెంతన్ సవయస్క పుణ్యసతి మించన్ జాహ్నవిం బోలి, వే**
**ల వలెన్ గోడలు నిల్చి కొల్వ, నిభృతోత్సాహుండు జీమూతకే**
**తువు శోభిల్లు, సముద్రతుల్యరుచు లుద్యోతిల్ల నాసీనుడై. 84**

ఈయన నడిగి జీమూతవాహను వృత్తాంతమునుఁ

దెలిసికొందును. **(పరిక్రమించును)**

**(అప్పుడు జీమూతకేతువు తన భార్యతోనుఁ, గోడలితోనుఁ గలసి**

**ప్రవేశించును)**

**జీమూతకేతు:** దేవీ!

**పొందితి సర్వసౌఖ్యములు, బొల్పుగఁ గీర్తిని విస్తరించితిన్,**

**జెందితి రాజ్యవైభవము. నిష్ఠవహించి తపంబుఁ జేసితిన్,**

**నందను డీడ్యుడయ్యె, సుగుణమ్ముల నీ స్నుష సర్వయోగ్య, యి**

**ట్లందితి నేఁ గృతార్థత, యనంతరకామ్య మికేమి? మృత్యువే. 85**

**ప్రతీ:** **(త్వరగా సమీపించుచు)** జీమూతవాహనునికొరకు.

**జీమూతకేతు:** **(చెవులు మూసికొని)** పాపము శమించుగాక.

**దేవి:** అమంగళము తప్పిపోవును!

**మలయ:** ఈ దుర్నిమిత్తమున నా గుండె దడదడ లాడుచున్నది!

**జీమూతకేతు:** **(ఎడమ కన్నదరుటను సూచించి)** భద్రా! ఏమి జీమూతవాహనునికొరకు? వానికిఁ గుశలమే కదా!

**ప్రతీ:** జీమూతవాహనునికొరకు వచ్చితిని. వారి వార్త నరయుటకే విశ్వావసుమహారాజులవారు తమ కడకు నన్నుఁ బంపినారు.

**జీమూతకేతు:** జీమూతవాహను డక్కడ లేడా?

**దేవి:** **(భయము, దిగులుతో)** మహారాజా! ఇక్కడను లేక, యక్కడను లేక, నా బిడ్డ యింకెక్కడకేగి యుండును?

**జీమూతకేతు:** నాకుఁజూడ , యాహారవస్తువుల నిమిత్తము చాల దవ్వు పోయి యుండు ననిపించు చున్నది.

**మలయ:** **(విషాదముగా తనలో)**నాకు మాత్ర మార్యపుత్రునిఁ జూడకుండుటచేత చిత్త మన్యధా శంకించుచున్నది.

**ప్రతీ:** దేవా! మహారాజుల కేమని విన్నవింతునో సెలవీయుడు.

**జీమూతకేతు:** **(మరల ఎడమకన్నదరుటను సూచించి)** కుమారుని రాక జాగగుచున్నకొలది నాకును మనసు కలతగానే యున్నది.

**అదరకె పలుమారులు నీ**
**వదక్షిణాక్షీ! యనిష్ట మని తెలుపుచు నా,**
**కిదె ప్రతిహతమగు నీ యీ**
**యదరుట యెల్లయును,మేలె యగునా బిడ్డనికిన్. 86**

**(పైకిఁ జూచి)** త్రిలోకైకాక్షి యైన యీ సూర్యభగవానుడే నా బిడ్డనికి రక్ష . **(చూచుచు, ఆశ్చర్యముతో)**

**మెరుగులు గ్రమ్మ చూడ్కి మిరుమిట్లు గొనన్, తన శోణకాంతికిన్**
**సరియగు రక్తధారలనుఁ జార్చుచు, సంక్షయవాతధూతమై**
**ధరపయి రాలు తారవలె , తానొక వస్తు విదేమొ రాలు వా**
**విరి రయ మొప్ప, వారిధరవీథులనుండి మదంతికస్థలిన్. 87**

అరే! కాళ్ళయొద్దనే పడినదే!

**(అందరు దానిని జూచుచుందురు)**

**జీమూతకేతు:** ఔరా! ఏమీ! పచ్చిమాంసము, తలవెండ్రుకలు నంటుకొని యున్న చూడామణి! ఇదెవ్వరిదైయుండునో!

**దేవి:** **(భయముతో, విషాదము గా)** మహారాజా! నా బిడ్డ శిరోరత్నమువలె నున్నదే!

**మలయ:** మాతా! అట్లనకుము.

**ప్రతీ:** మహారాజా! తెలియక మీరిట్లు భయపడవలదు. ఇక్కడిది సాధారణమే.

**గరుడుండుపట్టి తినియెడు**
**నురగుల పడగలకుఁ బాసి యుర్విస్ రాలుస్**
**నిరతం బిచ్చో నీదృశ**
**శిరోమణులు తోకచుక్క చెలువునఁ బెక్కుల్.88**

**జీమూతకేతు:** దేవీ! ఈ మాట యుక్తిసహము. అట్లే యై యుండ వచ్చును.

**దేవి:** సునందా! ఈ పాటికి కుమారుడు తన మామగారింటికి వచ్చియే  యుండును . పోయి చూచి త్వరగా మాకుఁ దెలుపుము.

**ప్రతీ:** దేవి గారి యానతి. (నిష్క్రమించును).

**జీమూతకేతు:** దేవీ! ఇది నాగచూడామణియే యందువా!

**(అప్పుడు ఎర్రని వస్త్రములు గప్పుకొని శంఖచూడుడు ప్రవేశించును)**

**శంఖ:**

**జలధితటిని గోకర్ణేశుఁ గొలిచి వేగ,**
**నాగవధ్యస్థలముఁ జేరినానొ లేదొ,**
**గుండె వ్రీలంగ నఖముల గ్రుచ్చి పట్టి**
**గరుడి విద్యాధరునిఁ గొంచుఁ బరచెఁ దివికి.  89**

హా హా మహాసత్వా! పరమకారుణికా! పరదుఃఖదుఃఖితా! అకారణబాంధవా! ఏమైతివి! మారు పలుకవా! ఓరీ నీచ శంఖచూడా! ఎంత పనిఁ జేసితివిరా!

**నాగకులార్థమై మడిసి నాకముఁ గీర్తియుఁ గాంచనైతి, యు**
**ద్వేగము లేక యేలిక నిదేశము నైననుఁ దీర్పనైతి, యే**

**త్యాగియొ నాకునై తనువు నర్పణఁ జేయగఁ జిక్కినాడ, ఛీ!**
**యీ గతి దిక్కుమాలితి, నికేవిధి మాయుఁ గళంక మార్తియుస్? 90**

ఇట్లు శోచ్యమైన జీవితముతో నపహాస్యపాత్రము నగుట క్షణమైన భరింపఁ జాలను. నేనే పోయి నన్ను గరుడున కర్పించుకొందును. **(పరిశీలించి)** పక్షిరాజు ముక్కునఁ గరచి తన్నుకొనిపోయినప్పుడు విద్యాధరుని మేనినుండి కారిన రక్త మిక్కడ పడి కనబడుచున్నది. **(మెల్లగా బరిక్రమించుచు)**

**తొలిచోట్ల పెల్లు ధారలు గారుటం జేసి**
**వెడద చారికలు గన్పించు నిచట,**
**ధార తగ్గుటచేతఁ, దార్క్ష్యవేగముచేతఁ,**
**గొంచెంపు ధార గన్పించు నిచట,**
**దూరమేగు కొలంది, ధార గారక, పృథు**
**బిందుపాతమ్ము గన్పించు నిచట,**
**పతనవేగముచేత బండలం బడి చింది,**
**యించుకించుకయ కన్పించు నిచట.**
**ధాతురంజితస్థలుల దుర్దర్శమగుచు,**
**దరుల ముంగిటఁ, దరువులస్,స్థాన మగుచుఁ,**
**దోచు నీ రక్త పథమునుఁ జూచుకొనుచు**
**నరిగి చేరెద తార్క్ష్యడున్నట్టి చోటు. 91**

**(నడచును)**

**దేవి:** మహారాజా! ఎవరో దుఃఖవిషణ్ణవదనముతో నిటే వచ్చుచున్నారు. నా మనస్సు మిగుల వ్యాకుల మగు

చున్నది. ఆతడెవరో కనుగొనుడు.

**జీమూతకేతు:** అట్లే, రానిమ్ము. అతనినే యడిగెదను.

**శంఖ:** **(రోదించుచు)** హా త్రిలోకైకచూడామణీ! ఏమైతివి? నిన్నెక్కడ జూడగలను? నష్టపోయితిని. మోసపోయితిని గదా!

**జీమూతుకేతు:** **(విని, నవ్వి, సంతోషముతో)** దేవీ! దుఃఖింపకుము. ఇది యీతని చూడామణియై యుండును. ఏ పక్షియో మాంసలోభమునఁ దన్నుకొని పోయి యుండును. పోవు చుండగా దాని పట్టు జారి యిక్కడ బడినది.

**దేవి:** **(మలయవతినిఁ గౌగిలించుకొని)** సౌభాగ్యవతీ! ధైర్య మూనుము.నీవంటి మంగళరూపశాలినికి వైధవ్యామంగల మెట్లు గలుగును?

**మలయ:** **(ఆనందముతో)** తల్లీ! మీ ఆశీర్వాదప్రభావమున. **(ప్రణమిల్లును)**

**జీమూతకేతు:** **(శంఖచూడుని యొద్దకు బోయి)** వత్సా! నీ చూడామణి యెమైన పోయినదా యేమి?

**శంఖ:** ఆర్యా! నాయొక్కని చూడామణి గాదు. త్రిభువన చూడామణియే.

**జీమూతకేతు:** అనగా! అదేమి నాయనా!

**శంఖ:** దుఃఖాతిశయమున బాష్పావరుద్ధకంఠమునఁ జెప్ప లేకున్నాను

**జీమూతకేతు:** **(తనలో)**హా దౌర్భాగ్యులము!నిరాశయేనా!(ప్రకాశముగా)

**రమ్మి టాత్మీయ ! పుత్ర! దుఃఖమ్మిదేమొ**

**తెలుపఁ దగిన మాకునుఁ గొంత దెలుపు మయ్య!**
**ఎంత దుస్సహమగు దుఃఖమేని జనుల**
**కొరులతోఁ జెప్పుకొన బాధ యుడుగుఁ గొంత. 92**

**శంఖ:** వినుడు. నేను శంఖచూడుడను నాగుడను. మా రాజు వాసుకి నన్ను నేడు గరుడున కాహారముగాఁ బంపెను. సరే, ఇప్పు డా కథ యంతయు నెందులకు?ఆలసించిన నీ రక్తరేఖలు మట్టి గ్రమ్మి కనబడకుండఁ బోవునేమో! కనుక సంక్షేపముగా జెప్పెదను.

**అప్పు డొక్క విద్యాధరుం డచట యుండి,**
**కరుణ పై నన్నుఁ గావంగఁ గడగి, యతని**
**గరుడునకు నిచ్చుకొని నన్నుఁ గాచె; నకట!**
**యట్టి యన్యోపకృతిశీలు డన్యు డెవడు? 93**

**జీమూతకేతు:** అంతటి పరోపకారవ్యసను డింకెవరు నాయనా! జీమూతవాహనుడే యని చెప్పుము. హా మంద భాగ్యుడను, సర్వనాశనమై పోయితిని.

**దేవి:** అయ్యో! పుత్రకా! ఇంతపని యెట్లు జేసితివి తండ్రీ!

**మలయ:** ఏమీ! మన పాడు యూహ యే నిజమైనదా!

**(అందరు మూర్ఛిల్లుదురు)**

**శంఖ:** **(కన్నీటితో)** వీరా మహోదారుని తల్లిదండ్రులే యై యుందురు. ఈ యప్రియవార్తఁ జెప్పి వీరికీ పాటుఁ దెచ్చితినా! అవును మరి విషధరుని నోటినుండి విషపు వార్తలు గాక యమృత వాక్కులు జాలువారునా! ఆహా! నా ప్రాణరక్షకుడైన జీమూతవాహనునికి తగిన

ప్రత్యుపకారమే చేసితిని! ఇక నైనఁ జచ్చుటయే మేలు గదా! ఇక్కడనే ప్రాణత్యాగ మొనర్తును.కాదు, ముందు వీరిని కొంత యూరార్చెదను. అయ్యా! తేరుకొనుడు.. అమ్మా! ఊరడిల్లుము.

**(ఇరువురు మూర్ఛ దేరుదురు.)**

**దేవి:** బిడ్డా! లెమ్ము! ఏడువకుము. జీమూతవాహనుడు లేక మనముండ  గలమా! ఊరడిల్లుము.

**మలయ:** **(తేరుకొని, ఏడ్చుచు )** నా స్వామీ! ఇంక నిన్ను నేనెక్కడ జూడగలను!

**జీమూతకేతు:** హా వత్సా! పితృశుశ్రూషా విధివిజ్ఞా!

**మా పదములొద్ద నీ శిరోమణిని వైచి**
**యట్లు, పరలోకమునకేగు నప్పుడైన,**
**నీవు విడువవైతివి నీ వినీతవృత్తి,**
**పితృపదార్చన నీవంటి సుతుడు గలడె? 94**

**(చూడామణినిఁ బట్టుకొని)** వత్సా! ఇదేనా మాకు నీ చూపు! ఇక లేవా! **(మణిని గుండెపైఁ బెట్టుకొని)** అయ్యో! ఎంత దారుణపు వింత!

**నాకడకేగుదెంచుచు వినమ్రుడవై కడుభక్తి దవ్వులన్**
**నాకు సహాంగకాష్టకప్రణామముఁ జేయుటఁ జేసి నిత్యధా**
**త్రీకషణమ్ములన్ నునుపు దేలిన నీ యవతంసరత్న మ**
**య్యో!కడుఁ జీల్చు నాయెద,ననూహ్య మసహ్యముగా కుమారకా95**

**దేవి:** పుత్రా! జీమూతవాహనా! పితృశుశ్రూషాసుఖము దప్ప మరొక సుఖముపై నాసక్తియే లేని నీకు , తల్లిదండ్రులను

వీడి స్వర్గసుఖములనుభవింప మనసైనదా తండ్రీ!

**జీమూతకేతు:** **(కన్నీటితో)** దేవీ! జీమూతవాహనుడు లేనప్పుడు మనము మాత్రము జీవింతుమా యేమి? ఏల యీ మాటలు?

**మలయ:** **(మోకరిల్లి ,అంజలించి)** ఆర్యా! నా యార్యపుత్రుని మారుగా యీ  చూడామణిని నాకు దయ జేయుడు. దీనిని యెదఁ దాల్చి యగ్నిప్రవేశముఁ జేసి నా హృదయతాపమునుఁ దీర్చుకొందును.

**జీమూతకేతు:** పతివ్రతామతల్లీ! తాళుము, మనకందరకు నిదే నిశ్చయము గదా!

**దేవి:** మహారాజా! ఐన మరి యీ జాగేల?

**జీమూతకేతు:** జాగేమియును లేదు దేవీ. మరి యాహితాగ్నినగుట నా యగ్నిచేతనే సంస్కారముఁ జేసికొన వలయును గాని వేరే యగ్ని పనికిరాదు. అందువలన యగ్నిగృహమున కరిగి మన యగ్నులు దెచ్చెదను. దాన నందరము దాటి పోవుదము.

**శంఖ:** **(తనలో)** అక్కటా! నా యొక్కని మూలమున విద్యాధర కులమెల్ల  యంతమగుచున్నది గదా! ఐనను, ఇట్లు చెప్పి చూచెదను. **(ప్రకాశముగా)** అయ్యా! పర్యవసానము నిక్కముగఁ దెలియకయే యిట్టి సాహసము దగదు గదా! దైవవిలాసము లనూహ్యములు గదా! ఒక వేళ,  తాను బట్టుకొని వచ్చినది నాగునిఁ గాదని తెలిసికొని గరుత్మంతుడు  మీ సుతుని వదలిపెట్టి యుండవచ్చు

నేమో! కనుక యీ మార్గమునుబట్టి గరుత్మంతు డున్నచోటికే పోవుదము రండు.

**దేవి:** నాయనా! ఆ ముక్కోటి దేవతల దయవలన నీ నోటి చలువన నా పుత్రుని మొగము మరలఁ జూడగలనేమో!

**మలయ:** **(తనలో)** ఈ భాగ్యహీనురాలి కది దుర్లభము గదా!

**జీమూతకేతు:** నాయనా! నీ వన్న యీ మాట తప్పక తథ్య మగును గాక. ఐనను, మాకు మా యగ్నులనుఁ బుచ్చుకొని వచ్చుటయే యుక్తతరము.కాబట్టి నీవు పోవు చుండుము, మేమును, అగ్నిగృహమునుండి యగ్నులనుఁ దీసికొని నీ వెంటనే వచ్చెదము.

**(భార్యతోనుఁ, గోడలితోనుఁ గలిసి నిష్క్రమించును.)**

**శంఖ:** సరే, నేను నా దారిన గరుత్మంతుని జూడనుఁబట్టి పోయెదను. **(పరిక్రమించి, యెదుట జూచి)** అడుగో!

**నెత్తుటి ముక్కుతోడ గిరి నెత్తము రాచిన ద్రోణులేర్పడన్**
**గ్రొత్తగ, ఘోరదృష్టిశిఖికోటులఁ జెంత వనాళి నీరుగా,**
**నొత్తిడి ధాటికిన్ పవిసమోగ్రనఖమ్ముల నేల వ్రీలగా,**
**వ్యాత్తముఖుండు వాడె, మలయాద్రిశిరస్తటిఁ బన్నగాశియున్.** 96

**(అంతట నాసీనుడై భుజించుచున్న గరుడుడును,**
**ముందు నేలపై బడి యున్న జీమూతవాహనుడును బ్రవేశింతురు)**

**గరుడుడు:** పుట్టినప్పటి నుండియు భుజంగమపుంగవులఁ బట్టి తినుచునే యున్న నే నీనాటి వింతవంటి వింత నింతవరకుఁ జూడలేదు. ఏమన, నీ మహాసత్త్వు డేమో కాని వ్యథఁ జెందకపోవుటయే కాక, మీదు మిక్కిలి

సంతసించుచున్నట్లు గనఁబడుచున్నాడు.

**క్లమమున్ జెందడు మేని రక్తమును బీల్చన్ వీడు ధైర్యాబ్ధి, మాం**
**సముఁ ద్రోటిన్ బెకలింపఁ బుట్టు వ్యథలన్ సైచున్ బ్రసన్నాస్యుడై,**
**యమితంబై పులకల్ గనంబడు శరీరాచ్ఛిన్నభాగంబులన్,**
**సముదంబై ననుఁ జూచు చూడ్కి,నిజహంతన్ న్వోపకారిన్ బలెన్97**

వీని యమితధైర్యప్రవృత్తి నాకుఁ గుతూహలమునుఁ
గలిగించుచున్నది. వీనినిఁ దినను! వీడెవడో యడిగెదను.
**(తినుటమాని తొలగి నిలుచును)**

**జీమూతవా:** **(తినకపోవుటఁ జూచి)**

**క్షరియించున్ రుధిరమ్ము మామకసిరాసందోహ మందింకనున్,**
**దరసం బింకను నా శరీరమున గన్పట్టున్, నినున్ జూడ , క్షు**
**త్పరితృప్తిన్ గనినట్లు లే, వశనమధ్యంబందు నిష్కారణం**
**బరవాయిన్ గొని, తిండి మానితి విదేలా నీవు నాగాశనా! 98**

**గరుడుడు:** **(ఆశ్చర్యముగా, తనలో)** ఏమాశ్చర్యము! ఈ దశలో
గూడ యెంత నిబ్బరముగఁ బలుకుచున్నాడు!
**(ప్రకాశముగా)** ఆహా! మహాసత్వా!

**నీ యెడదఁ జీల్చి యొక కొంత నెత్తు రేను**
**ద్రావితిని గాని, యిట్టి దుర్దశను గుండె**
**జెదర కిట్టి ధైర్యమున గెల్చితివి నీవు**
**మూల మట్టుగ నా డెందమును మహాత్మ! 99**

కనుక నీ వెవడవో తెలియ నుత్సుకతగా నున్నది .

**జీమూతవా:** ఇట్లాకట వేగుచున్న నీకిప్పుడవి వినఁదగినవి కావు.
ముందు నా మాంసముతో నీ యాకలినిఁ దీర్చుకొనుము.

**గరుడుడు:** **(తనలో)** నన్నుఁ జూచినంతనే భయముతో వణకి నిశ్చేష్టుడై గుండెలు పగిలి చావవలసిన యీ నాగునికి, యింత విచిత్రధీరత్వ మేమో కదా! వీడెవడో నాగులలోఁ దప్పఁబుట్టి నట్లున్నాడు.

**శంఖ:** **(తటాలున సమీపించి)** గరుడా! వలదు వలదు, తొందర పడకుము. పాపపు పని మానుము. ఇతడు నాగుడు గాడు.వదలివేయుము. నీ కాహారముగా వాసుకి బంపిన నాగుడను నేను! నన్ను, నన్ను భక్షింపుము.

**జీమూతవా:** **(శంఖచూడునిఁ జూచి,విషాదముతో తనలో)**అయ్యో!శంఖ చూడుడు రానే వచ్చినాడే! నా వాంఛ విఫలమైనది గదా!

**గరుడుడు:** **(ఇరువురనుఁ జూచి)** ఇరువురికిని వధ్యచిహ్న మున్నది! మీలో నాగుడెవరో తెలియుట లేదే!

**శంఖ:** భ్రాంతికి తావే లేని చోట భ్రాంతియా! చూడుము.

**ఎదపైనన్ స్వస్తికాంకం బెటులయొ కనన ట్లెంచినన్, గంచుకంబై**
**నఁ, దనువ్యాప్తంబు నీ కంటఁ బడదె? కనవే నాలుకల్ రెంటి, నోటన్**
**గదలన్ నే బల్కుచుండన్? గరళశిఖిశిఖాగ్రస్తరత్నాంశులన్, శు**
**గ్విదళత్ఫూత్కారరాజిన్ విడివడు పడగల్ వీటినిన్ మూటి నేనిన్?** 100

**గరుడుడు:** **(ఇరువురినిఁ బరిశీలించి,శంఖచూడుని పడగలను గుర్తించి )**నీవే నాగుడవు.మరి,నేను దినుచున్న దెవరిని?

**శంఖ:** విద్యాధరవంశతిలకుడు, కాదు కాదు, సర్వభువనైక తిలకుడు జీమూతవాహనుడు. దయమాలి , చూడక యింత ఘోరము నెట్లు జేసితివో !

**గరుడుడు:** ఆ! ఏమీ ఇతడు - ఆ విద్యాధరకుమారుడు--

జీమూతవాహనుడా?

**అరరే! మందరకందరమ్ముల, మహేంద్రాద్రిన్, మహామేరుభూ**
**ధరమందున్, దుహినాద్రిఁ, జందనమహీధ్రమ్మందుఁ, గైలాసమం,**
**దరుదం, చందును నందుఁ జారణులు లోకాలోకచారుల్ నుతిం**
**తురు యత్కీర్తిని, నెప్పుడే వినగ ; మాన్యం డాత డీతండటే! 101**

అయ్యయ్యో! దురుద్ధరపాపపంకమునఁ బడిపోయితిని గదా!

**జీమూతవా:** నాగకుమారా! ఎందులకు నీ కీ యావేగము!

**శంఖ:** ఆవేగము కాక మరేమి?

**ఉరగభోజికి నీ దేహ మొసగి, దాన**
**నతని బారికి ననుఁ గాచు టనిన, నన్నుఁ**
**గ్రింది లోకమ్ముకంటెనుఁ గ్రిందఁ బడగఁ**
**ద్రోయుటే కదా! నీ కిట్లు జేయఁ దగునె? 102**

**గరుడుడు:** అయ్యో! నాకాహారము గానున్న నాగుని రక్షించుటకై యాతనికి మారుగా తననే యీ కరుణార్ద్రమానసుడు నాకాహారముగ నిచ్చుకొనినాడన్న మాట! ఎంతయో ఘోర పాతకమును జేసితిని.పాతకమన్న మాట యేమి? సాక్షాత్తు,బోధిసత్త్వునే చంపితి నన్నమాట!అగ్నిలోఁ బడి చచ్చుట దప్ప, యింతటి నీచపాపమునకు మరొక ప్రాయశ్చిత్తమే లేదు. ఇక్కడ యగ్ని యెక్కడ దొరకును?(**చుట్టునుఁ జూచి**)అరుగో! వీరెవరో యగ్నులనుఁ దాల్చి యిటే వచ్చుచున్నారు! రానిమ్ము వారి యొద్దఁ దీసికొందును.

**శంఖ:** యువరాజా! నీ తల్లిదండ్రులు వచ్చినారు.

**జీమూతవా:** **(సంభ్రమముగా)** ఏమీ నా తల్లిదండ్రులా! శంఖచూడా! త్వరగా యిటువచ్చి కూర్చుండి,యీ యుత్తరీయముతో నన్నుఁ గప్పి యట్లే పట్టుకొని యుండుము. లేదేని, నన్నిట్లుండగాఁ జూచిన వారికి క్షణమైననుఁ బ్రాణములు నిలువవు.

**శంఖ:** **(అట్లే చేసి యుండును)**

**(అంతట జీమూతకేతువు తన భార్యతోను, మలయవతితోను గలిసి ప్రవేశించును)**

**జీమూతకేతు:** **(కన్నీటితో)** వత్సా! జీమూతవాహనా!

**దయఁజూపన్ బరుడన్ స్వకీయుడని భేదంబుండ, దట్లయ్యు, నా**
**రయవా సుంతయు? నొక్కనిన్ మనుప మేలా! పెక్కురన్ గాచుటొ**
**క్కొ! యటం,చొక్క ద్విజిహ్వుఁ గావ నసువుల్ గోల్పుచ్చు నీ తెంపు, గూ**
**ల్చె యిటుల్ నిన్, సతిఁ, దల్లిదండ్రులను, నిశ్శేషంబుగా వంశమున్.103**

**దేవి:** బిడ్డా! కొంచెము దుః ఖమాపుకొనుమమ్మా! నీ కన్నీటి ధారలకీ యగ్ని గూడ యారి పోవునట్లున్నది,

**(పరిక్రమింతురు)**

**జీమూతకేతు:** హా పుత్రా! జీమూతవాహనా!

**గరుడుడు:** **(విని)** 'పుత్రా జీమూతవాహనా' యనుచున్నాడు! ఈ నాగుడు జెప్పిన ట్లావచ్చునది యితని తండ్రియే యై యుండును. వీరి పుత్రుని వధించిన నా మొగము వీరికిఁ జూపించుటకే నాకు సిగ్గగు చున్నది. ఇంక యే మొగముఁ బెట్టుకొని వీరి నగ్ని నిమ్మని యడిగెదను? ఐనను,

అగ్ని కొరకేల నాకింత చింత? చెంతనే సముద్ర మున్నది
గదా! దానిలో బడబానలమే యున్నది !

**త్రైలోక్యగ్రసనోత్సుకాప్రహతసర్వత్కాలజిహ్వాసమ**
**జ్వాలామాలల, సప్తవార్ధిజలముల్ సర్పిష్కణంబుస్ బలెస్**
**గ్రోలం జాలుచు, మద్గరుద్భవమరుత్ప్రోద్ధూతసంధుక్షణో**
**త్కీలంబౌ లయవహ్నిచండబడబాగ్నిస్ వ్రాలి నే ముగ్గెదస్.** 104

**జీమూతవా:** పక్షిరాజా! ఈ దుర్వ్యవసాయము వలదు. నీ పాపమునకు ప్రాయశ్చిత్త మిది గాదు..

**గరుడుడు:** **(మోకరిల్లి, దోసిలిఁ బట్టి)** మహాత్మా! కానిచో, మరేమో సెలవిమ్ము.

**జీమూతవా:** ఒక్క క్షణముండుము. నా తల్లిదండ్రులు వచ్చినారు. వారికి నమస్కరింపవలయును.

**గరుడుడు:** అట్లే కానిమ్ము.

**జీమూతవా:** దేవీ! ఏమి నీ యదృష్టము! అదే మన జీమూత వాహనుడు బ్రదికి యుండుటయే కాదు, గరుడుడే వీని ముందు వినమ్రుడై కృతాంజలియై శిష్యునివలె సేవించు చున్నాడు.

**దేవి:** మహారాజా! నిజముగనే యదృష్టవంతురాలను. కనుగందని మేనితో నున్న కుమారుని మొగమే చూచుచున్నాను.

**మలయ:** **(ఆత్మగతము)** ఆర్యపుత్రుడు నా యెదుట గనబడుచునే యున్నను,పెద్దల యెదుట మర్యాదనుబట్టి ముందునకుఁ బోవలేకున్నాను.

**జీమూతకేతు:** **(సమీపించి)** వత్సా! రమ్ము. నా యొడిలోనికి రమ్ము.

**జీమూతవా:** **(లేవబోయి, పడి, మూర్ఛిల్లును. ఉత్తరీయము జారిపోవును)**

**శంఖ:** **(పట్టుకొని)** యువరాజా! తెప్పరిల్లుము.

**జీమూతకేతు:** వత్సా! ఏమిది! చూచియు మమ్ము వదలి పోయితివా!

**దేవి:** హా పుత్రా! మాటమాత్ర మైనను నాతోఁ బలుకవా!

**మలయ:** ఆర్యపుత్రా! నీ తల్లిదండ్రుల నైననుఁ జూడవైతివా!

**(ముగ్గురును మూర్ఛిల్లుదురు.)**

**శంఖ:** ఓరీ! నీచా!శంఖచూడహతకా! క్షణక్షణము చావును మించిన దుఃఖము ననుభవించుచున్న నీవు పుట్టకయే యున్న బాగుండెడిది గదా!

**గరుడుడు:** ఇదంతయు నా యరయిక లేమివలన గదా వచ్చినది! **(రెక్కలతో వీచుచు)** మహాత్మా! తెప్పరిల్లుము.

**జీమూతవా:** **(తెలిసి)** శంఖచూడా! తల్లిదండ్రులనుఁ దేర్పుము.

**శంఖ:** అయ్యా! అమ్మా! తేరుకొనుడు. మీ సుతుడు మూర్ఛ దేరినాడు. చూడుడు. పైగా మిమ్ములనే తేర్పుమని చెప్పుచున్నాడు.

**(ఇరువురు మూర్ఛదేరుదురు)**

**దేవి:** పుత్రా! నిన్నిట్లు మా కళ్ళ ముందే యా మృత్యుదేవత కబళించుకొని పోవునా తండ్రీ!

**జీమూతకేతు:** దేవీ! అమంగళము లాడకుము. కుమారుడు తప్పక బ్రదుకును. కోడలి నూరార్పుము.

**దేవి:** **(ముఖముఁ గప్పుకొని రోదించుచు)** అమంగళము

నశించును! మలయవతీ! నిబ్బరమూనుము. లెమ్ము లెమ్ము. ఈ సమయమున నీవే నీ స్వామి ముఖమునుఁ జూచుట మంచిది.

**మలయ:** **(తెలిసి)** హా ఆర్యపుత్రా! నేనేమి జేయుదును? నా దౌర్భాగ్య మిట్లున్నదా!

**దేవి:** **(మలయవతి కన్నీటిని దుడుచుచు)** అమ్మాయీ! ఇట్లేడ్వకుము. అమంగళము తొలగియే పోయినది గదా!

**జీమూతకేతు:** **(కన్నీటితో)**

**గరుడభక్షితశేషైకకంఠదేశ**
**మందుఁ గడబట్టి కొట్టుమిట్టాడుచున్న**
**కొసరు టసువుల నల్లాడు కొడుకుఁ గనియుఁ,**
**బాపిఁ, గ్రూరుడ, నూరుగా వ్రయ్యనైతి!** 105

**మలయ:** ఆర్యపుత్రా! మిమ్మీ దశలోఁ జూచియు బ్రాణములను విడువకున్న నేనెంత ఘోరముల నైననుఁ దట్టుకొనఁ గలనేమో!

**దేవి:** **(కొడుకు దేహమును నిమురుచు, గరుడునితో)** ఓరి క్రూరుడా! నవయౌవనశోభితమై యందమైన నా బిడ్డ మేని నీ యవస్థకుఁ దెచ్చుటకు నీకెట్లు మనసొప్పెనురా?

**జీమూతవా:** అమ్మా! ఇతనిని నిందింపకుము. ఇందితని తప్పే మున్నది? నిక్కము జూచిన, మొదటినుండియు నీ దేహ మిట్టిదే కదా!

**ఎరచి, క్రొవ్వు, నెత్తు, రెమ్ములు, మూలుగ**
**గలిసి తోలు తిత్తి నిలువ దేహ;**

**మెపుడు రోత దప్ప యే యందముండు శ**
**రీరమందు? దీని తీరె రోత. 106**

గరుడుడు: మహాత్మా ! ఈ దుఃఖతాపము నన్ను నరకానల జ్వాలలకంటె నసహ్యతరముగ దహించుచున్నది.ఈ ఘోరపాపముఁ బాయుటకు మార్గమేదైన నుపదేశింపుము.

జీమూతవా: తండ్రీ!మీ రనుమతించిన,నే నీతనికిఁ బ్రాయశ్చిత్తమునుఁ దెలిపెదను.

జీమూతకేతు: నాయనా! అట్లే కానిమ్ము.

జీమూతవా: పక్షిరాజా! వినుము.

గరుడుడు: (మోకరిల్లి) ఆజ్ఞాపింపుము.

జీమూతవా:

**ఈపయిఁ బ్రాణిహింసఁ ద్యజియింపు, తపింపు కృతాఘు మెంచి, పు**
**ణ్యాపచయంబుఁ జేయు, మభయం బొనగూర్పుము జీవకోటికిన్,**
**ఈ పగిదిన్ జరించిన, సమేధితపుణ్యమహాప్రదంబులోఁ**
**దోపక, యుప్పుగల్లువలెఁ ద్రుంగు భవత్కృతపూర్వపాపముల్.107**

గరుడుడు: మహాత్మా! నీ యానతి మేరకు నడచుకొందును.

**అజ్ఞాననిద్ర గ్రమ్మిన**
**యజ్ఞుని మేల్కొలిపినావు ప్రాజ్ఞా! నన్నున్**
**నీ జ్ఞాన బోధ; నాదు ప్ర**
**తిజ్ఞ యిదే! యింక మానితిని ప్రాణివధన్! 108**

కనుక ,

**పులినవిశాలభోగములఁ బొల్పయి, యొక్కెడ దీవి వోలె; సం**
**వళితనిజోరుదేహులయి, వారిధి లో సుడులట్లు నొక్కెడన్**

**మలయుచుఁ బ్రాకుచుస్,దరుల మధ్యన సేతువులట్టు లొండెడస్;**
**జలధిని నేటినుండి ఫణిసంఘము లిచ్చమెయిస్ జరించుతస్.109**

ఇంకను,

**ఇరుల సమూహమట్లు వెలయించుచు నాపదలంబికేశముల్**
**పొరయగ సిందురంపుఁ జెలువుల్ దమ చెక్కుల, లేత యెండలస్;**
**నిరతముఁ జందనాటవుల నీ యశమే యనురక్తిఁ బాడుచుం, దురు,**
**భయమేది నాగయువతుల్,శ్రమమెంచక నిన్నుమెచ్చుచుస్ 110**

**జీమూతవా:** **మేలు మహాసత్త్వా! మేలు. సంతోషించితిని.** సత్య వచనుడవు గమ్ము. **(శంఖచూడుని జూచి)** శంఖచూడా! ఇంక నీవును సత్వరముగా యింటికేగుము! పాప మక్కడ నీ తల్లి యెట్లున్నదో!

**శంఖ:** **(నిట్టూర్చి, తలవాల్చుకొని నిలచి యుండును)**

**జీమూతవా:** **(నిట్టూర్చి, తన తల్లిని జూచి)** తమ్ముడా!శంఖచూడా!

**త్వద్విపత్తు తనవిపత్తుగాఁ గని తల్ల**
**డిల్లుచున్న నీదు తల్లి, నిన్ను**
**తార్క్ష్యచంచుకోటి దళితాంగునిగ నెంచి**
**గుండెలవియ నేడ్చుచుండు నకట! 111**

**దేవి:** **(కన్నీటితో)** గరుడునిబారినఁ బడియు, నొడలు నొవ్వని కొడుకు మొగము జూడ నోచిన యా తల్లియే నిక్కమైన ధన్యురాలు.

**శంఖ:** అమ్మా! యువరాజు మనకు క్షేమముగా దక్కినచో నీవన్న మాట సత్యమే యగును.

**జీమూతవా:** **(వేదన నభినయించుచు)** అబ్బా! పరోపకారసంజాత

సంతోషవివశుడనై యింతవరకుఁ దలపకుంటిని గాని, యిప్పుడీ మర్మభేదిక్షతవేదన నా ప్రాణములనుఁ బీల్చు చున్నది. **(మరణయాతన నభినయించును)**

**జీమూతకేతు:** **(సంభ్రమముతో)** వత్సా! ఏమిది నాయనా! చివరకిట్లు జేయుచున్నావా!

**దేవి:** అయ్యయ్యో! బిడ్డ యిట్లై పోవుచున్నాడేమి? అయ్యా! ఎవరైన గాపాడుడు, నా కొడుకు మమ్ములను వదలి పోవుచున్నాడు!

**మలయ:** **(రోదించుచు)** నాథా! నన్ను వదలిపోవుటకే సిద్ధమైతివా!

**జీమూతవా:** **(చేతులు జోడింపఁ బ్రయత్నించుచు)** శంఖచూడా! నా చేతులను దగ్గరకుఁ జేర్చుము.

**శంఖ:** **(చేర్చుచు)** అయ్యయ్యో! ఎంత కష్టము! లోక మిక దిక్కు లేనిదైనది గదా!

**జీమూతవా:** **(అరమోడ్పు కనులతో, తండ్రినిఁ జూచుచు)** తండ్రీ! తల్లీ! ఇదే మీకు నా చివరి నమస్కారము .

**కదలఁ జాల వంగకమ్ములు పట్టేది,**
**వినికి కొలది నుడుల వినవు వీను;**
**లెరుక లేకె కన్ను లివె వ్రాలు, మై నోలు**
**చున్న, దుసురు వెడలు చున్న దయ్య!** 112

ఐనను , ఇంకను మాటలేల?

**ఉరగునిఁ గావ నాతనువు నొప్పన జేయుటచేతఁ బుణ్యమే**
**పొరయున యేని, తత్ఫలము, పుట్టువు పుట్టువు నందు నీగతిస్**
**బరులకు మేలుఁ గూర్చుటకు పట్టగు దేహముఁ బొందుటౌను గా;**

కరయఁ, బరార్థమై చనని యంగము నంగమె, జన్మ జన్మయే! 113

(పడిపోవును)

**దేవి:** హా పుత్రా! నాయనా! గురుజనవత్సలా! ఎక్కడకుఁ బోయితివి? పలుకవా!

**జీమూతకేతు:** వత్సా! జీమూతవాహనా! స్వజనప్రాణసమానా! మమ్ము వదలిపోయితివా! మాకు మారుబలుకవా!( **చేతులెత్తి, దుఃఖముతో**)

ఏ వంక నాధార మింక ధైర్యమునకు?
విడిది జిక్కునె యింక వినయమునకు?
తలదాచుకొన నింక తాల్మికి చోటేది?
దానతంత్రత కింక స్థాన మెచట?
సత్యమన్నది యింక సత్యంబుగా సున్న,
గతియున్నె గతి చన్న కరుణ కింక?
సర్వోపకారదీక్షకు దక్షు డెవడింక?
తావింక దొరకునే త్యాగమునకు?
నిలువ నీడ లేదు నిష్కల్మషత కింక,
పుణ్య మెచట కాలు మోపు నింక?
పుత్ర! నీవు బోవఁ, బుడమి నాకిక సర్వ
శూన్య మగుచుఁ దోచుచున్నదయ్య! 114

**మలయ:** ఆర్యపుత్రా! నన్ను వదలి యెట్లు పోఁగలిగితివి? ఓసీ కఠినాత్మురాలా మలయవతీ! ఏమి జూచుటకని యింకను బ్రదికియున్నావు?

**శంఖ:** కుమారా! ప్రాణసమానులైన నిజజనులనుఁ గూడ వదలి

యెచ్చటకుఁ బోయెదవు? శంఖచూడు డవశ్యము నిన్ననుసరించియే వచ్చును.

**గరుడుడు:** అయ్యో! ఈ మహాత్ము డస్తమించినాడే! ఇప్పుడు నాకుఁ గర్తవ్యమేమి?

**దేవి:** **(ఏడ్చుచు పైకిఁ జూచుచు)** లోకపాలకదేవతలారా! ఏట్లైన నమృతము గురిపించియైన నా పుత్రుని బ్రదికించి యీయరా!

**గరుడుడు:** **(సంతోషముతో, తనలో)** ఓహో! అమృతమన్న మాటచేఁ జక్కగా జ్ఞప్తికి వచ్చినది! అపకీర్తి బాసినట్లే! ఇదే దేవేంద్రు నర్థించి యమృతముఁ గురిపించి యీ జీమూతవాహను నొక్కనినే కాక మున్ను నాచే గతాసువులై యస్థిశేషులైన నాగులనుఁ గూడ పునర్జీవింపఁ జేసెదను. ఒక వేళ యింద్రుడే నా మాటను మన్నింపనిచో-

**రెక్కలగాలి నంబుపతి రిత్తవడన్, బవనుండు తూలగన్,**
**నిక్కిన చూడ్కి మంటలకు నీరుగ నగ్నియు ద్వాదశార్కు, లే**
**నెక్కటి, నా వృషాశనిధనేశగదాయమదండఖండముల్**
**దిక్కుల రాలఁ గ్రుమ్మి, సుధఁ దెచ్చి త్రుటిన్,బ్రదికింతు నెల్లరన్.115**

ఇదే పోయి తెచ్చెదను. **(ఆటోపముతో పరిక్రమించి నిష్క్రమించును)**

**జీమూతకేతు:** నాయనా శంఖచూడా! ఇంకను నాలస్య మేల? ఇంధనములఁ బేర్చి నా సుతునకుఁ జితినిఁ గూర్పుము. మేమును వానినే యనుగమింతుము.

**దేవి:** వత్సా! త్వరగఁ జేయుము నాయనా! మేము లేమి నీ

యన్న దుఃఖించుచుండును.

**శంఖ:** **(కన్నీటితో)** మీ యానతి. కాని, యిందు నేను మీకంటె ముందే. **(లేచి చితిని పేర్చి)** అయ్యా! అమ్మా! ఇదే చితి సిద్ధము.

**జీమూతకేతు:** హా! ఎంత దుర్భాగ్యము! నాయనా, జీమూతవాహనా! ఏమి కావలసినవాడ వేమైతివి?

**శ్రీ విభ్రాజిశిరస్సునస్ వెలయు నుష్ణీషమ్ము, భ్రూమధ్య మూ**
**ర్ణావర్తాన్వితమున్, బదద్వయము చక్రాకార చిహ్నంబు, వ**
**క్షోవిస్తీర్ణత విష్ణువున్ గెలుచు, జక్షుల్ పద్మముల్; వోయెదే**
**మా విద్యాధరరాట్పదంబు గొనకే? మా పాప మిట్లుండెనా?** 116

దేవీ! ఇంక నేడ్చి యేమి ప్రయోజనము? లెమ్ము . చితిలోనికిఁ బ్రవేశింతము.

**(అందరు లేచి పరిక్రమించుచున్నారు)**

**మలయ:** **(అంజలి బట్టి, ఏడ్చుచు)** దేవీ గౌరీ! నా భర్త విద్యాధర చక్రవర్తి కాగలడని వరమిచ్చితివే! నా దౌర్భాగ్యము తుదకు నిన్నుఁ గూడ యళీకవాదినిగా జేయు నంత పాపిష్ఠమా!

**(అంతట గౌరీదేవి ప్రవేశించును)**

**గౌరి:** మహారాజా! జీమూతుకేతూ! వలదు,వలదు. తొందరపడి పాపపుఃబనిఁ జేయకుము.

**జీమూతకేతు:** ఆహా! ఏమి? అమోఘదర్శన యగు గౌరీభగవతి.

**(అందరు ప్రణమిల్లుదురు)**

**గౌరి:** **(మలయవతితో)** వత్సా! నా మాట లెట్లు తప్పును?

(జీమూతవాహనునిఁ జేరి కమండలుజలముఁ జల్లుచు)

ప్రాణ మిచ్చి యైనఁ బరహితం బొనగూర్చు
నీ చరిత్ర మెచ్చు నించె నాకు,
క్షేమ మగును నీకు, జీమూతవాహనా!
బ్రదుకు; తల్లి, దండ్రి, భార్య, మురియ. 117

జీమూతవా: (స్వస్థుడై లేచును) భగవతీ! వందనము.

జీమూతకేతు: (ఆనందముతో) దేవీ! చూడు నీ యదృష్టము! కుమారుడు బ్రదికినాడు.

దేవి: దేవి దయవలన.

(ఇరువురు గౌరి పాదములకు మ్రొక్కి, కొడుకును గౌగిలించుకొందురు)

మలయ: భాగ్యవశమున నా పతి నాకు మరల దక్కినాడు!(గౌరి పాదములకు నమస్కరించును)

జీమూతవా: (చేతులు జోడించి) జగన్మాతా!

అడిగినదానికి నెక్కువ యిడుదువు,దుఃఖములు దీరవే నిను గొలువన్!
కడు భక్తి వ్రాలెదను నీ యడుగుల విద్యాధరాన్వయావని! గౌరీ! 118

(మరల గౌరి పాదములకు నమస్కరించును.)

(నేపథ్యమునఁ గలకలము. అందరు పైకిఁ జూచుచుందురు)

జీమూతకేతు: అరే! ఈ మబ్బులు లేని వాన యేమి? భగవతీ! ఏమిది?

గౌరి: రాజా! జీమూతుకేతూ! తన నాగవధపాపమునకును, జీమూతవాహనభక్షణదుష్కృతమునకునుఁ బశ్చాత్తాప పడిన పక్షిరాజు, దేవలోకమునకేగి, నీ సుతునితోపాటుగా యీ యస్థిశేషులైన నాగులనుఁగూడ బ్రదికించుటకు యింద్రునివలన నిప్పుడీ యమృతవర్షమునుఁ

గురిపించుచున్నాడు. **(చేతఁ జూపుచు)** నీవు చూడలేదా! అటు చూడుము.

**తనువుల్ బూర్వపురీతి వొంది, ఫణరత్నభ్రాజమానోత్తమాం**
**గనికాయమ్ములతో, సుధాకణరసాకాంక్షన్ ద్విజిహ్వల్ పురో ౼**
**వని నాకన్, మలయాద్రిసంభవసరిద్వారిప్రపూరంబులో**
**యన, జిహ్మప్రసరంబులన్,ఫణులవే యబ్ధిన్ వడిన్ జొచ్చుచున్.119**

**(జీమూతవాహనునితో)**వత్సా!నీత్యాగమునకు జీవన మాత్రదానము సరిపోదు. నీకు మరొక యనుగ్రహము గూడ. చూడుము. .

**జలముల్ హంసవిధూతపంకజరజస్సంపర్కపంకోజ్ఝితం**
**బులు, మన్మానససంభవంబులు, మహా పూతంబు, లీ కామ క్లే**
**ప్త లసద్రత్నఘటంబులందు, నిట త్వద్రాజ్యాభిషేకంబు సం**
**ధిల, విద్యాధరరచక్రవర్తిపదమం దేనే నినున్ నిల్పెదన్. 120**

ఇంతే కాక,

**ఇదిగో కనకచక్ర, మిదిగో చతుర్దశ**
**నాచ్ఛ దంతి, యిదిగో శ్యామ హయము;**
**ఇదియె మలయవతియు, నిదె చక్రవర్తియౌ**
**నీకుఁ దగిన రత్న నిచయ మయ్య! 121**

మరియు నటు జూడుము, నా పనుపున మతంగదేవాది త్వద్విరోధివిద్యాధరపతులు చలద్వినమ్రమకుటరత్న సంజాతేంద్రచాపులై నీకు వశులై నిలిచి యున్నవారు. వత్సా! ఇంకను నీకేమైన ప్రియమునుఁ జేకూర్చ మందువా?!

**జీమూతవా:** (మోకరిల్లి నిలిచి) తల్లీ! ఇంకనుఁ గావలసిన ప్రియము లున్నవా!

బ్రదికెను శంఖచూడు డహిభక్షణు బారికిఁ దప్పి, తార్క్ష్యుడున్
వదలెను ప్రాణిహింస, నిజభక్తితులన్ బ్రదికించె నెల్లరన్,
నిధనము దప్పె నాకు, జననీజనకుల్ సుఖులైరి దాన, నా
కొదవెను చక్రవర్తిపద, మొప్పితి నిన్ గని, కామ్య మేమికన్! 122

ఐనను జగద్రక్షణపరాయణమైన నీ కృప వలన నిట్లగు గాక!

కురియున్ గాక పయోదముల్ సమదకేకుల్ దాండవం బాడగన్,
ధరణిన్ సంతతరూఢసస్యవసనన్ గావించు వృష్టిన్; సుఖిం
తురు గాకెల్లరు సర్వబాంధవసుహృద్గోష్ఠీముదం బొప్ప, మ
త్సరమున్ బొందక, పుణ్యకార్యపరులై, సంపత్సమావాప్తితోన్.123

మరియు,

అఖిలలోకంబులకు శుభమగును గాక!
పరహితైకేచ్ఛ భూతముల్ బరగుఁ గాక!
దోషములు సర్వనష్టమై తొలగుఁ గాక!
యెల్లెడల లోకులకు సుఖ మగును గాక! 124

**గౌరి:** తథాస్తు.

(అందరు నిష్క్రమింతురు.)

**ఇది శ్రీ హర్షుని నాగానందనాటకమునకు**
**మార్కండేయ ప్రసాద్ చేసిన ఆంధ్రానువాదమునందు**
**పంచమాంకము . నాగానందనాటకము సమాప్తము.**

-*-

## ఉపసంహారము

ఉచ్యతే కవివృత్తాంతం గ్రంథాతే ౾త్ర సమాసతః
ప్రపంచవ్యవహారాయ, జిజ్ఞాసూనాం కృతే ౾థవా.

ఆంధ్రః కుత్ససగోత్రో జోగాంబాసుబ్బరాయయోః పుత్రః,
నందవరవిప్రవంశ్యో మార్కణ్డేయప్రసాదనామాహమ్.

శాకే ౾శ్వశిఖిరసేందౌ(1937)
మన్మథ ఆషాఢబహుళపంచమ్యామ్
రచనమిదం సంపూర్ణం
శరశశిగగనాక్షికలిత(2015) హూణాబ్దే.

ఏవం బుద్ధైకచరణార్ణపథప్రయాణే
స్వప్రీతిమాత్రఫలదం కృతవాన్ ప్రయత్నం
అల్పశ్రుతో౾ప్యహ, మతీవ సముత్సుకత్వాత్,
అస్త్యేవ కాపి రుచి రత్ర కృతశ్రమాణామ్.

-*-

తెలుగు అనువాదము: మార్కండేయ ప్రసాద్ -2015.